


epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

సంపుటి : 19 సంచిక : 44 | 24-04-2026 శుక్రవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 12 వెల : రూ.1.00



## కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు

ఆర్టీసీ సమ్మెపై కేబినేట్ భేటీలో ప్రస్తావన

నేడు చర్చలు జరపాలని డిప్యూటీ సిఎంకు ఆదేశం

అనాలోచిత చర్యలకు పాల్పడవద్దని శ్రీధర్ బాబు వినతి

హైదరాబాద్, **అక్షరకలం ప్రతినిధి**

ఆర్టీసీ కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈమేరకు ఆయన కేబినెట్ భేటీలో మాట్లాడారు. ప్రాణాలు తీసుకోవడం వల్ల సమస్య పరిష్కారం కాదన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు తాము చిత్తశుద్ధితో ఉన్నామని.. ఈ అంశంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. శుక్రవారం కార్మిక సంఘాలతో చర్చించాలని మంత్రులకు సీఎం సూచించారు. ఈక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రులు.. కార్మిక సంఘాలతో సమావేశం కానున్నారు. నర్సంపేటలో ఓ డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిన ఘటన నేపథ్యంలో సిఎం ఈ వ్యాఖ్యలు చేసినట్లుగా తెలుస్తోంది. ఇదిలావుంటే ఆర్టీసీ కార్మికులు సంయమనం పాటించి... సమ్మె విరమించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తప్పకుండా చర్చలు జరుపుతుందని గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులు ఎలాంటి తొందర పాటు నిర్ణయాలు తీసుకోవద్దని, ప్రాణాలు తీసుకునే అనాలోచిత చర్యలకు పాల్పడి మీ కుటుంబాలకు అన్యాయం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. క్షణికావేశంతో కొత్త సమస్యలు వస్తాయని, ప్రేరేపిత శక్తుల ఒత్తిడికి బలి కావొద్దని కోరారు. కార్మికుల సమస్యల్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వెంటనే చర్చలకు ముందుకు రావాలని కార్మిక సంఘాల నేతలకు పిలుపునిచ్చారు. కార్మికులు ఆత్మనిబ్బరంతో ఉండాలని... ప్రభుత్వం తో చర్చల ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. మరోవైపు.. ఈయూ ఆఫీసులో ఆర్టీసీ జేఏసీ అత్యవసర సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా జేఏసీ ఛైర్మన్ వెంకన్న, వైస్ ఛైర్మన్ థామస్‌రెడ్డి తదుపరి కార్యాచరణ ప్రకటించారు.

# రెండోరోజూ కొనసాగిన ఆర్టీసీ సమ్మె

- ఎక్కడిక్కడే నిలిచిపోయిన బస్సులు
- బలవంతంగా నడిపేందుకు యత్నాలు
- పలుచోట్ల కార్మికులను అదుపులోకి తీసుకున్న పోలీసులు





తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె గురువారం కూడా కొనసాగింది. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు నానా యాతన పడుతున్నారు. తమ న్యాయమైన హక్కుల కోసం ఉద్యమిస్తున్న ఆర్టీసీ కార్మికులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. పోలీసుల పహారాలో బస్సుకు ఒక కానిస్టేబుల్‌ను పెట్టి బలవంతంగా బస్సులను నడుపాలని చూస్తున్నది. అయినప్పటికీ ఆర్టీసీ కార్మికులు తెల్లవారుజాము నుంచే బస్సుల వద్దకు చేరి ఒక్క బస్సును కూడా కదలనీయలేదు. పోలీసులు బలవంతంగా ఆర్టీసీ కార్మికులను అరెస్ట్ చేసినా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణికులు అధిక ధరలు చెల్లించ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది.

వార్త 2లో



### తెలంగాణ సాధనలో ఆర్టీసి కార్మికులే కీలకం

ఆర్టీసీ సమ్మెలో భాగంగా రాణిగంజ్ డిపో ముందు కార్మికులతో కలిసి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ధర్నాకు దిగారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. ఆనాడు కేసీఆర్ సకల జనులను ఏకం చేశారని .. అందులో ఆర్టీసీ కార్మికులు ప్రధాన పాత్ర పోషించారని గుర్తుచేశారు. 2



### కెసిఆర్ కుటుంబంపై చర్యలు తీసుకునే దమ్మేది

కాళేశ్వరం అంశంలో హైకోర్టు తీర్పుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ఊరట కలిగించింది హైకోర్టు కాదని.. రేవంత్ రెడ్డి ప్రభుత్వమంటూ వ్యాఖ్యానించారు. 2

2



### ఆర్టీసీ సమ్మెకు ప్రభుత్వానిదే బాధ్యత



### తమిళనాడులో పోలింగ్ ప్రారంభం

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

ఓటేసిన సినీనటులు రజనీ, కమల్, అజిత్ తదితరులు

ఓటేసిన చిదంబరం, స్టాలిన్ , ఉదయనిధి

వార్త 2లో

### అద్దె బస్సులను నడిపేందుకు యత్నం

సమ్మెను విచ్చిన్నం చేయవద్దని వేడుకున్న కార్మికుడు

**జనగామ,**



రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతున్నది. పోలీసుల పహారా మధ్య బలవంతంగా అద్దె బస్సులను నడిపేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా ఆర్టీసీ కార్మికులు ఎక్కడి కక్కడ అడ్డుకుంటున్నారు. తాజాగా జనగామ జిల్లాలో నిరసనకు దిగిన ఆర్టీసీ కార్మికులను అడ్డుకోవద్దంటు ఓ ఆర్టీసీ కార్మికుడు పోలీసుల కాళ్లు పట్టుకుని వేడుకున్న సంఘటన ప్రతి ఒక్కరిని కదలించింది. జనగామ ఆర్టీసీ డిపో ఎదుట సీఐ సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నడుమ జనగామ డిపో నుండి వివిధ ప్రాంతాలకు బస్ కు ఒక కానిస్టేబుల్‌ను పెట్టి పంపిస్తున్నారు. ఈ క్రమంలో న్యాయమైన తమ డిమాండ్ల కోసం రోడ్డెకిన తమను అడ్డుకోవద్దంటూ పోలీసుల కాళ్లు మొక్కి వేడుకున్నాడు. కాగా, డిమాండ్స్ నెరవేర్చే వరకు సమ్మె ఆపేదే లేదని ఆర్టీసీ కార్మికులు స్పష్టం చేస్తున్నారు.

## ఓటు వేయడం బాధ్యతగా గుర్తించండి

తమిళనాడు, బెంగాల్ ఓటర్లకు మోడీ పిలుపు

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**



తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో పోలింగ్ సందర్భంగా.. ఓటర్లు తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ముఖ్యంగా తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల పోలింగ్ దృష్ట్యా, ఓటర్లు ఉత్సాహంగా తరలిరావాలని ఆయన కోరారు. ఓటు వేయడాన్ని కేవలం ఒక బాధ్యతగా మాత్రమే కాకుండా, దేశం పట్ల ఒక పవిత్ర కర్తవ్యంగా భావించాలని ప్రధాని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి ఓటు దేశ భవిష్యత్తును నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తుందని, కాబట్టి ఏ ఒక్కరూ ఓటింగ్‌కు దూరం కాకూడదని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల్లో యువత, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మోదీ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. మొదటిసారి ఓటు వేస్తున్న యువత నవ భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. మహిళలు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. గత రికార్డులను తిరగరాస్తూ, ఈసారి పోలింగ్ శాతం గణనీయంగా పెరగాలని ప్రధాని ఆకాంక్షించారు. ప్రజాస్వామ్య పండుగలో పౌరులందరూ చురుగ్గా పాల్గొని.. పారదర్శకమైన, పటిష్టమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంలో తమ వంతు సహకారం అందించాలని 'ఎక్స్' వేదికగా ఆయన సందేశాన్ని పంచుకున్నారు.

### ఆర్టీసీ సమ్మెలో ఉద్రిక్తత

పెట్రోల్ పోసుకుని డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

వరంగల్, **అక్షరకలం ప్రతినిధి**

ఆర్టీసీ డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం అవలంభిస్తున్న మొండి వైఖరికి నిరసనగా వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం తీవ్ర సంచలనం కలిగించింది. రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలో దిగిన ఆర్టీసీ కార్మికులు రెండోరోజు అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట మహాధర్నాకు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా గురువారం నర్సంపేట డిపో ఎదుట ధర్నాలో పాల్గొన్న డ్రైవర్ కోలా రమేశ్‌గౌడ్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. సహచర కార్మికులు వెంటనే అప్రమత్తమై మంటలను ఆర్పివేసి తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం వరంగల్ ఆసుపత్రికి తరలించారు.

# రెండోరోజూ కొనసాగిన ఆర్టీసీ సమ్మె

## తమిళనాడులో పోలింగ్ ప్రారంభం

### ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

### ఓటేసిన సినీనటులు రజనీ, కమల్, అజిత్ తదితరులు

### ఓటేసిన చిదంబరం, స్టాలిన్ , ఉదయనిధి









చెన్నై, అక్షరకలం ప్రతినిధి

తమిళనాడు అసెంబ్లీ పోలింగ్ గురువారం ఉదయం ప్రారంభం అయ్యింది. ఓటర్లు ఓటేసేందుకు బారులు తీరారు. పలువురు ప్ముఖులు ముందుగానే వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు హీరోలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సూపర్ స్టార్ రజనీకాంత్ చెన్నైలోని స్టెల్లా మారిస్ కాలేజీలో పోలింగ్ బూత్ నెంబర్ 237లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక మక్కల్ నీది మయ్యమ్ (ఎంఎన్ఎం) చీఫ్, ప్రముఖ నటుడు కమల్ హాసన్, ఆయన కుమార్తె శృతిహాసన్ ఆళ్వార్ పేట స్కూల్ కు చేరుకుని తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. మరో ప్రముఖ నటుడు ఎస్. అజిత్ కుమార్ చెన్నైలోని తిరువాన్మియూర్ లో ఓటు వేశారు. కాగా, ప్రముఖ నటుడు ప్రభు, విక్రమ్ ప్రభు, శివకార్తికేయన్ లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 'ఓటు వేయడం అనేది భారత పౌరుల హక్కు. దయచేసి ఆ ఓటుహక్కును వినియోగించుకోండి' అని ఈ సందర్భంగా హీరో ప్రభు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తమిళనాడులో మొత్తం 234 స్థానాల్లో ఓటింగ్ జరుగుతోంది. తొలి గంటల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 11 గంటల వరకు తమిళనాడులో 37.56 శాతం ఓటింగ్ నమోదైంది. శివగంగ ప్రాంతంలోని పోలింగ్ కేంద్రంలో కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం ఓటేశారు. భాజపా నేత ఖుష్బూ, నటి త్రిష ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీవీకే చీఫ్ విజయ్ చెన్నైలో ఓటేశారు. ఆయన తిరుచిరాపల్లి ఈస్ట్, పెరంబూర్ నుంచి పోటీలో ఉన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆయన భార్య దుర్గా స్టాలిన్, వారి కుమారుడు ఉదయనిధి స్టాలిన్ చెన్నైలో ఓటేశారు.

## తెలంగాణ సాధనలో ఆర్టీసి కార్మికులే కీలకం

### అవసరమైతే ప్రభుత్వాన్ని కూల్చే శక్తి వారికుంది

### రాణీగంజ్ డిపోముందు సంఘీభావం పలికిన తలసాని

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

ఆర్టీసీ సమ్మెలో భాగంగా రాణిగంజ్ డిపో ముందు కార్మికులతో కలిసి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ధర్నాకు దిగారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. ఆనాడు కేసీఆర్ సకల జనులను ఏకం చేశారని.. అందులో ఆర్టీసీ కార్మికులు ప్రధాన పాత్ర పోషించారని గుర్తుచేశారు. తెలంగాణ సాధనలో ఆర్టీసీ కార్మికుల కృషి మర్చిపోలేనిదని.. ఆ విషయం ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రభుత్వాన్ని కూల్చే శక్తి ఆర్టీసీ కార్మికులకు ఉందన్నారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీసుకోవాలని ఆనాడు కేసీఆర్ కేబినెట్ నిర్ణయం తీసుకుందని.. కానీ ప్రభుత్వం మారిందని తెలిపారు. ఆర్టీసీకి ఎంతో ప్రాముఖ్యం ఉందని తలసాని చెప్పుకొచ్చారు. రెండు రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తుంటే.. ప్రజలు అల్లాడిపోతున్నారని తెలిపారు. ప్రతిపక్ష నేతలు వెనకుండి సమ్మె చేయిస్తున్నారని ఓ మంత్రి అంటున్నారని.. అసలు ప్రభుత్వం ఇచ్చిన హామీలు తీరిస్తే సమ్మె ఎందుకు చేస్తారని ప్రశ్నించారు. సమ్మె చేసే ఉద్యోగులను ఆర్టీసీ ఎండీ బెదిరిస్తున్నారని మండిపడ్డారు. అందరం కలిసి సెక్రటేరియట్ ముట్టడికి వెళ్దామని.. ప్రభుత్వం మెడలు వంచి హామీలను సాధిద్దామని మాజీ మంత్రి పిలుపునిచ్చారు. పీఆర్సీ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి గుర్తుచేశారు. ఎలక్ట్రికల్ బస్సులకు ప్రైవేట్ డ్రైవర్లను పెట్టి నడిపిస్తున్నారని.. ఆర్టీసీ బస్సు నడిపిన డ్రైవర్లకు ఎలక్ట్రికల్ బస్సు నడపడం రాదా అని నిలదీశారు. 'మీరు ధైర్యంగా పోరాటం చేయండి. మీ వెనుక కేసీఆర్ ఉన్నారు. మీ వెనుక మా పార్టీ మొత్తం ఉంది' అంటూ ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కేబినెట్ సమావేశం అయిన వెంటనే ఆర్టీసీ జేఏసీని ప్రభుత్వం చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. హామీల విషయంలో పూర్తి స్పష్టత ఇవ్వాలన్నారు. తూతూ మంత్రంగా ఒప్పుకోవద్దని జేఏసీ సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేశారు. 29 డిమాండ్లు తీర్చేందుకు సిద్ధంగా ఉన్నామని అంటున్నారని.. మరి ఆ 29 డిమాండ్లు ఏంటో మీడియా సాక్షిగా విడుదల చేయాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు.

## కెసిఆర్ కుటుంబంపై చర్యలు తీసుకునే దమ్మేది

హైకోర్టు తీర్పు పుణ్యం రేవంత్ రెడ్డిదే
మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
హైదరాబాద్,

కాళేశ్వరం అంశంలో హైకోర్టు తీర్పుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ఊరట కలిగించింది హైకోర్టు కాదని.. రేవంత్ రెడ్డి ప్రభుత్వమంటూ వ్యాఖ్యానించారు. గురువారంఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ కుటుంబంపై అనేక ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చి రెండేళ్లైనా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకునే దమ్ములేకే తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రెండేళ్లు ఫామ్‌హౌస్‌లో పడుకుని ఇప్పుడు మళ్లీ కేసీఆర్ మోటార్లకు మీటర్లు అంటున్నారని కేంద్ర మంత్రి సెటైర్ విసిరారు. పదేళ్ల నుంచి అదే పాట పడుతున్న కేసీఆర్ ఒక్కరోజూ దాన్ని నిరూపించలేకపోయారని విమర్శించారు. మైక్ దొరికితే ఆయనంత మేధావి ఎవరూ లేరని కేసీఆర్ అనుకుంటారన్నారు. ఆర్టీసీ కార్మికులకు రాహుల్ గాంధీ , రేవంత్ రెడ్డి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఒక్క జీవోతో వాళ్ల సమస్యలు పరిష్కారం అయ్యేవని.. కానీ ఆర్టీసీ కార్మికులను రేవంత్ రెడ్డి ఇబ్బంది పెడుతున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఎక్కడికక్కడే నిలిచిపోయిన బస్సులు

### బలవంతంగా నడడిపేందుకు యత్నాలు

### పలుచోట్ల కార్మికులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె గురువారం కూడా కొనసాగింది. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు నానా యాతన పడుతున్నారు. తమ న్యాయమైన హక్కుల కోసం ఉద్యమిస్తున్న ఆర్టీసీ కార్మికులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. పోలీసుల పహారాలో బస్సుకు ఒక కానిస్టేబుల్‌ను పెట్టి బలవంతంగా బస్సులను నడుపాలని చూస్తున్నది. అయినప్పటికీ ఆర్టీసీ కార్మికులు తెల్లవారుజాము నుంచే బస్సుల వద్దకు చేరి ఒక్క బస్సును కూడా కదలనీయలేదు. పోలీసులు బలవంతంగా ఆర్టీసీ కార్మికులను అరెస్ట్ చేసినా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణికులు అధిక ధరలు చెల్లించ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. మెదక్ ఆర్టీసీ డిపో నుంచి ఈరోజు తెల్లవారుజామున బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రయత్నం చేయగా కార్మికులు అడ్డుకోవడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. గురువారం తెల్లవారుజామున ఆర్టీసీ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య బస్సులు నడిపేందుకు డిపో నుంచి బస్టాండ్ వరకు బస్సులు తీసుకురాగా కార్మికులు సమాచారం తెలుసుకొని భారీ సంఖ్యలో చేరుకొని అడ్డుకున్నారు. ఆర్టీసీ బస్సులను అడ్డుకోవడంతో పోలీసులు కార్మికులను బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9డిపోల్లో 600 వందల బస్సులు నిలిచి పోయాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సమ్మె కొనసాగుతున్నది. కామరెడ్డి జిల్లాలో ఆర్టీసీ కార్మికుల టెంట్‌ను పోలీసులు తొలగించడంతో వివాదం చోటు చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా రెండో రోజు బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్ డిపోల ఎదుట ఆర్టీసీ కార్మికులు డిపోల ఎదుట ధర్నా చేపట్టారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో బస్సులు నడుపాలని చూడగా ఆర్టీసీ కార్మికులు అడ్డుకున్నారు. మహబూబా బాద్ జిల్లాలో ఆర్టీసీ కార్మికులపై పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించారు. రెండో రోజు సమ్మె కొనసాగు తుండగా తొర్రూరు డిపో వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. విధులకు రాని 21 మంది కార్మికులపై కేసు నమోదు చేశారు. సమ్మెలో పాల్గొనేందుకు డిపో వద్దకు వస్తున్న కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయడంపై ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు. తక్షణమే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ఆర్టీసీ సమ్మెకు ప్రభుత్వానిదే బాధ్యత

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

కార్మికుల పక్షాన ఉంటానని చెప్పి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట తప్పారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ ఇద్దరే అంటూ వ్యాఖ్యానించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుందని రాంచందర్ రావు స్పష్టం చేశారు. తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మెపై ఆయన తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వం అసలు సమస్యలు పక్కన పెట్టి కేబినెట్ అంటూ కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. పీఆర్సీ మీద అప్పుడు కేసీఆర్ మాట ఇచ్చి తప్పారని గుర్తుచేశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని విమర్శించారు. అన్ని జిల్లాల వ్యాప్తంగా బీజేపీ పార్టీ కార్యకర్తలు వారికి మద్దతుగా ఉంటారని తెలిపారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని.. లేదంటే బీజేపీ తరుపున ఆందోళనలో పాల్గొంటామని అన్నారు. రేపు(శుక్రవారం) ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరపాలని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు డిమాండ్ చేశారు.

## ఆర్టీసీ సమ్మెపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి

### ఇచ్చిన హామీ మేరకు నడుచుకోవాలి

### మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి డిమాండ్

నిజామాబాద్, అక్షరకలం ప్రతినిధి

ఆర్టీసీ కార్మికుల సమ్మె డిమాండ్లను పరిష్కరించకపోతే తెలంగాణలో 'మరో సకల జనుల సమ్మె' తప్పదని బిఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. కమిటీలతో ఇంకా ఎంతకాలం తమను మభ్యపెడుతూ, కాలయాపన చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర సాధనలో అగ్రభాగా ఉన్న ఆర్టీసీ కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి విమర్శించారు. ఆర్టీసీని ప్రైవేట్‌పరం చేయడానికి ఈ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని ధ్వజమెత్తారు. ఒక్కసారి ఆర్టీసీ ప్రైవేట్‌పరమైతే ప్రజలకు భారం తప్పదని హెచ్చరించారు. ఇది ఒక ఆర్టీసీ కార్మికుల సమస్య కాదని, యావత్తు తెలంగాణ ప్రజల సమస్య అని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల విలీనంపై సర్కార్ వైఖరేమిటో చెప్పాలని ప్రశ్నించారు. అధికారుల కమిటీ ఎలాంటి సమస్యలకూ పరిష్కారం చూపలేదని తెలిపారు. తమను పిలిచిన చర్చల్లో ఒక్క మంత్రి లేరని, అందుకే ఐఏఎస్ అధికారుల కమిటీ చేతులెత్తేసిందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు రాష్ట్రవ్యాప్తంగా సకల జనుల మద్దతు ఉన్నదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతో కాలయాపన చేయకుండా చేతల్లో తమ పనితనం చూపించాలని డిమాండ్ చేశారు. నాడు ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలపై ఇప్పుడు వైఖరి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ దుర్మార్గ విధానాలతో రోడ్డుక్కుతున్న జనం

### ఆర్టీసీ సమస్యలు పరిష్కరించకుండా నిర్వీర్యం చేసే కుట్ర

### బిఆర్ఎస్ నేత జి .దేవీప్రసాద్ విమర్శలు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

రాష్ట్రప్రభుత్వ దుర్మార్గ విధానాల ఫలితంగా అన్ని వర్గాలు రోడ్ల పైకి వస్తున్నాయని బిఆర్ఎస్ నేత జి .దేవీప్రసాద్ పేర్కొన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆర్టీసీ కార్మికులు నుంచి సమ్మె ప్రారంభిస్తే వాటిని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతుందని గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆరోపించారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని కేసీఆర్ హయంలో ఆగస్టు 2023 లో గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారని, నాడు ఎన్నికల కోడ్ రావడంతో నిర్ణయం అపాయింటెడ్ డే రాలేదని తెలిపారు. మొత్తం 32 డిమాండ్ల పై ఆర్టీసీ కార్మికులు సమ్మె నోటీస్ ఇస్తే ఆర్టీసీ యాజమాన్యం చర్చలకు పిలువలేదని ఆరోపించారు. ఆర్టీసీ బస్సులకు నైపుణ్యం లేని డ్రైవర్లను తాత్కాలికంగా నియమించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిన్న తాత్కాలిక డ్రైవర్ నిర్వాహకంతో 38 మంది ప్రయాణికులు గాయ పడ్డారని వివరించారు. తాండూరు లో పోలీసులు జారీ చేసిన హెచ్చరిక దుర్మార్గంగా ఉందని , సీఎం జిల్లాలో పోలీసులు ఎమె÷-జన్గ÷న్సీ రోజులను గుర్తుకు తెస్తున్నారని వెల్లడించారు. సమ్మె పై బీజేపీ గోడ మీద పిల్లి వాటాన్ని



ప్రదర్శిస్తోందని దుయ్యబట్టారు. ఆర్టీసీ సమ్మె వెనక హరీష్ రావు ఉన్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. హరీష్ రావు ఆర్టీసీ కార్మికులకే కాదు. సమస్యల్లో ఉన్న వారి ఎవరికైనా మద్దతు ఇస్తారని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీ అమలు చేసింది కేసీఆర్ మాత్రమేనని వెల్లడించారు. కాళేశ్వరం ఘోష్ కమిషన్ నివేదిక పై హై కోర్టు తీర్పు తో ప్రభుత్వానికి కను విప్పు కావాలని సూచించారు. ఘోష్ కమిషన్ రిపోర్ట్ నేపధ్యంలో ఇరిగేషన్ ఇంజినీర్ల పై క్రమశిక్షణ చర్యలకు ఇచ్చిన నోటీసులు వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## నగరంలో పెద్ద ఎత్తు కల్తీ టీపొడి విక్రయం

### దాడి చేసి ముఠాను పట్టుకున్న పోలీసులు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

హైదరాబాద్ నగరంలో టీ ప్రియుల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి కాసులు కురిపించుకుంటున్న ఒక ముఠాను పోలీసులు ఆట కట్టించారు. నకిలీ టీ అమ్మతతున్న ముటాను పట్టుకున్నారు. రహస్య సమాచారం మేరకు జరిపిన మెరుపు దాడుల్లో సుమారు 4 టన్నుల కల్తీ టీ పౌడర్, దానికి సంబంధించిన రసాయనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సాధారణంగా హోటళ్లు, టీ స్టాళ్లలో వాడి పారేసిన టీ పొడిని సేకరించి, దానికి హానికరమైన రంగులు, కృత్రిమ వాసనలు కలిపి తిరిగి ప్యాక్ చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కల్తీ పొడిని చూడగానే అసలైన టీ పొడిలాగే కనిపించేలా రసాయనాలు వాడుతున్నారని పోలీసులు తెలిపారు. ఈ దందాపై గత కొన్ని రోజులుగా నిఘా పెట్టిన పోలీసులు, అత్యంత గోప్యంగా ఆపరేషన్ నిర్వహించి కల్తీ కేంద్రాలపై దాడి చేశారు. ఈ కేసులో మొత్తం 10 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో కల్తీ టీ పొడిని తయారు చేసేవారితో పాటు, తక్కువ ధరకు వస్తుందని తెలిసి కూడా దీన్ని కొనుగోలు చేస్తున్న కొంతమంది టీ షాప్ ఓనర్లు కూడా ఉన్నట్లు సమాచారం. ఈ కల్తీ టీ పొడిలో కలిపే రంగులు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తాయని ఆహార భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## తెలంగాణ భవిష్యత్ కెసిఆర్‌కే సాధ్యం

### మీడియా సమావేశంలో జీవన్ రెడ్డి



రాజన్నసిరిసిల్ల, అక్షరకలం ప్రతినిధి

కుట్రలు, కుతంత్రాలతో పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి తెలంగాణ భవిష్యత్‌ను కాపాడటమే కేసీఆర్ లక్ష్యమని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. సిరిసిల్ల బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన జగిత్యాల సభ తెలంగాణ సమాజానికి దిక్సూచిగా నిలిచిందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి పోవాలే కేసీఆర్ రావాలేనని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు యావత్ తెలంగాణ ప్రజలకు జీవధార అని వెల్లడించారు. హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డికి చెంప పెట్టు అని వివరించారు. కేసీఆర్, హరీష్‌రావు, అధికారులను కేసులో ఇరికించాలని చేసిన కుట్రలు పటాపంచలయ్యాయని అన్నారు. ప్రతి రోజు రేవంత్ రెడ్డికి కలలో కేసీఆర్ కనపడుతున్నాడని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, మండల పార్టీ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో ఒక్కసారిగా మారిన వాతావరణం

### మేఘావృతమై ఉరుములతో చిరుజల్లులు

హైదరాబాద్,

హైదరాబాద్ మహానగరంలో గురువారం మధ్యాహ్నం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మధ్యాహ్నం రెండు గంటల వరకు తీవ్రమైన ఎండలు దంచి కొట్టగా.. ఆ తర్వాత ఉన్నట్టుండి వాతావరణం మేఘావృతం అయ్యింది. ఆకాశం మేఘావృతమై ఉరుములతో పలుచోట్ల చిరుజల్లుల కురిసాయి. ఈ క్రమంలోనే వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. హైదరాబాద్, కామారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. నగరంలో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, ఉరుములతో కూడిన వర్షాలు కురవొచ్చని వాతావరణ కేంద్రం తెలిపింది. తెలంగాణలో ద్రోణి, క్యుములోనింబస్ మేఘాల ప్రభావం నెలకొందని వాతావరణశాఖ వెల్లడించింది. శుక్రవారం నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. అదేవిధంగా రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నది.

# కులాల మధ్య చిచ్చుతో రాజకీయ పబ్బం

### వైసిపి తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

**రాజమండ్రి,**

రాష్ట్రంలో కులాల మధ్య విభేదాలు సృష్టించి.. రాజకీయ పబ్బం గడుపుకోవాలని వైసీపీ ప్రయత్నిస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆరోపించారు. 'కులాల మధ్య చిచ్చు పెడుతుంటే మేము చూస్తూ ఊరుకోం.. రాజకీయంగా పతనం కావడంతోనే జగన్ ఇలాంటి అరాచకాలకు తెరలేపారు' అని ఆయన విమర్శించారు. తనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని



ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తీవ్రంగా ఖండించారు. కాపు సామాజిక వర్గాన్ని కించపరిచే ఉద్దేశం తనకు లేదని, తన వ్యాఖ్యలను బ్లూ మీడియా ఉద్దేశపూర్వకంగా వక్రీకరించిందని ఆయన మండిపడ్డారు. ఇప్పటికే సాక్షి పత్రికై బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ.. 'రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పనిచేస్తున్నాం. అంబటి అయినా గింబటి అయినా ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదు. నా వ్యాఖ్యలను సాక్షి పత్రిక వక్రీకరించింది. జగన్ ఒక 'సూసైడ్ స్క్వాడ్'ను తయారు చేశారు. విచ్ఛిన్న శక్తులకు తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా మారింది. దేవాలయాలు, వ్యక్తుల పైనా దాడులు చేయిస్తున్నారు. జక్కంపూడి రాజా లాంటి వాళ్ళను పిచ్చి ఆసుపత్రిలో చేర్చాలి. మాజీ ఎంపీ మార్గాని భరత్ రాజమండ్రి కంబాల చెరువు, దేవిచౌక్ ప్రాంతాలను అభివృద్ధి పేరుతో కంపుకొట్టించారు. కుర్రాళ్లు వాస్తవాలు తెలుసుకొని రాష్ట్ర భవిష్యత్తు గురించి మాట్లాడితే బాగుంటుంది. కూటమి ప్రభుత్వం సమన్వయంతో పని చేస్తోంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒకే ఆలోచనా విధానంతో ముందుకు వెళ్తున్నారు. సిగ్గులేకుండా ఇసుక గురించి మాట్లాడుతున్న వైసీపీ నేతలకు దమ్ముంటే అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసురుతున్నా.' అని అన్నారు.

# ఉద్యోగిగా ఉంటూ వైసిపికి ప్రచారం

## 2024లోనే వెంకట్రామిరెడ్డి సస్పెన్షన్ మాజీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోక్ బాబు

**అమరావతి,**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డిపై చర్యలు ప్రారంభమయ్యాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు తెలిపారు. '2024లో ఆయనను సస్పెండ్ చేసింది మీ ప్రభుత్వమే' అని వైసిపికి గుర్తుచేశారు. 2024 ఎన్నికల సమయంలో వెంకట్రామిరెడ్డి వైసీపీ జెండాలు పట్టుకుని ప్రచారం చేసినట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. బద్వేల్ రిటర్నింగ్ అధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగానే అప్పట్లో వెంకట్రామిరెడ్డిపై నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి రాజకీయ ప్రచారంలో పాల్గొనడం 'కండక్ట్ రూల్స్'కు విరుద్ధమని.. అందుకే డిస్మిస్ చేశారని అశోక్ బాబు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆగష్టులో జరిగిన విచారణలో వెంకట్రామిరెడ్డి నేరం చేసినట్లు రుజువైందన్నారు. వెంకట్రామిరెడ్డి అరాచకాలు, నిబంధనల



ఉల్లంఘనలన్నీ జీఓ 464లో స్పష్టంగా ఉన్నాయని చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా చంద్రబాబు తప్పు చేస్తున్నారంటూ జగన్ మాట్లాడటం హాస్యాస్పదమని మండిపడ్డారు. ఉద్యోగులకు రూ.30 వేల కోట్లు బాకీ పెట్టి, జీతాలు సకాలంలో ఇవ్వని వ్యక్తి జగన్ అంటూ విమర్శించారు. ఉద్యోగుల గురించి మాట్లాడే అర్హత, హక్కు జగన్‌కు లేదని అశోక్ బాబు వ్యాఖ్యానించారు. ఈ మేరకు బుధవారం ఆయన మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు తప్పు చేశారంటూ జగన్ రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఏబీ వెంకటేశ్వరరావు, ఎల్వీ సుబ్రహ్మణ్యం వంటి అధికారులను వేధించింది మరిచిపోయారా అని నిలదీశారు. ఉద్యోగులను బెదిరించి దేశంలో ఎక్కడా లేని విధంగా రివర్స్ పీఆర్సీ ఇచ్చిన ఘనత జగన్‌దే అంటూ దుయ్యబట్టారు. కూటమి పాలనలో ఇప్పటికే ఉద్యోగులకు రూ.22,000 కోట్ల మేర బకాయిలు చెల్లించామని చెప్పారు. గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీలో అక్రమాలకు పాల్పడి పబ్లిక్ స్థలాలను కూడా అమ్మేసుకున్న వ్యక్తి వెంకట్రామిరెడ్డి అని ఆరోపించారు. వెంకట్రామిరెడ్డి కుటుంబం మొత్తం వైసీపీ కార్యకర్తలే అని.. ఆయన భార్య ముషీరాబాద్ టికెట్ అడిగిన విషయం నిజం కాదా అని అశోక్ బాబు ప్రశ్నించారు. కరోనా సమయంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు చనిపోతే పట్టించుకోని జగన్.. ఉద్యోగుల పాలిట 'నరకాసురుడు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నిబంధనల ప్రకారం, ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగిస్తున్నారని తెలిపారు. తప్పు చేసిన వారు శిక్ష అనుభవించాల్సిందే అని అశోక్ బాబు స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినందుకు జగన్ ప్రభుత్వం హయాంలోనే వెంకట్రామిరెడ్డి సస్పెండ్ అయ్యారని ఏపీ టీడీపీ ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు అన్నారు. జగన్ నిజం ఒప్పుకుంటున్నాడని, ఎందుకంటే ఆయన చేసిన తప్పులకు జైల్లో పెట్టకుండా చంద్రబాబు తప్పు చేశారని వ్యాఖ్యానించారు. చంద్రబాబు ఆ తప్పు చేయడంవల్లే జగన్ ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని అశోక్ బాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. 2024 ఏప్రిల్ 2న ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా కాండక్ట్ రూల్స్‌ను బ్రేక్ చేసి కాకర్ల వెంకట్రామిరెడ్డి, చల్లా చంద్రయ్యలు వైసీపీ జెండాలు పట్టుకొని కడప జిల్లాలోని నాలుగు ఆర్టీసీ డిపోల్లో వైసీపీకి అనుకూలంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారని ఆరోపించారు. అవినీతి, పనిపట్ల నిబద్ధత లేకపోవడం, పనిచేయకపోవడం వంటి వాటికి కాండక్ట్ రూల్స్ ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు.

# హామీలను నెరవేరుస్తూ..అభివృద్ధి..ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం,**



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ 22 నెలల్లోనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. గొందిరెడ్డిపల్లి నుంచి పుల్లలరేవు వరకూ రూ.1.30 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు, పుల్లలరేవులో రూ.50 లక్షలతో వేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. నియోజకవర్గంలో చేపట్టిన అన్నిపనులను పూర్తి చేస్తున్నామని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తూ 22 నెలల్లోనే రాప్తాడు మండలంలో రూ.26 కోట్లతో రోడ్లు వేశామన్నారు. గొందిరెడ్డిపల్లి నుంచి పుల్లలరేవు వరకూ తారు రోడ్డు నిర్మించామన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామన్నారు.

# ఆర్టీసీ సమ్మెకు బిఆర్ఎస్ సంఘీభావం

### ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేని ప్రభుత్వం

**హైదారబాద్,**

ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ సంఘీభావం తెలిపుతుందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ గత కేసీఆర్ ప్రభుత్వంలోనే కేబినెట్ ఆమోదం తెలిపి, జీవో, గెజిట్ ఇచ్చామన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిందే అమలు చేయమని ఆర్టీసీ కార్మికులు అడుగుతున్నారన్నారు.రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోవడం వల్లే ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి రూ.3000 కోట్లు ప్రభుత్వం బకాయిలు పడింది. దీంతో ఆర్టీసీ ఉద్యోగులకు డీఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేకపోతుందని విమర్శించారు. కార్మికులతో చర్చలు జరిపి వారి న్యాయబద్ధమైన కోరికలు నెరవేర్చాలన్నారు. తక్షణమే మహాలక్ష్మి బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఘోష్ కమిషన్‌ను పక్కన పెట్టిన హైకోర్టు

### న్యాయం గెలిచినట్లేనన్న పద్మాదేవేందర్

**మెదక్,**

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పును మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు ఎం పద్మా దేవేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించడం న్యాయం గెలిచినట్టేనని ఆమె పేర్కొన్నారు. కమిషన్ విచారణలో ప్రాథమిక న్యాయ నిబంధనలు పాటించలేదని కోర్టు స్పష్టం చేయడం ద్వారా ఆ నివేదికకు చట్టపరమైన బలం లేదని తేలిందన్నారు. ముఖ్యంగా సెక్షన్ 8 కింద సంబంధిత వ్యక్తులకు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఆరోపణలు చేయడం సరికాదని కోర్టు వ్యాఖ్యానించడం అత్యంత కీలక పరిణామమని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుపై రాజకీయ ఒత్తిడి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కమిషన్లను అడ్డంపెట్టుకుని వేధింపులకు పాల్పడిందని ఆమె విమర్శించారు. న్యాయస్థానాలపై నమ్మకంతో పోరాడగా చివరకు నిజం గెలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ జీవధారగా భావించే కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పార్టీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కక్షపూరితంగా వ్యవహరించాయని ఆరోపించారు. ప్రాజెక్టు మరమ్మతులను సకాలంలో చేపట్టకుండా దాదాపు రెండున్నరేళ్లు ఆలస్యం చేశారని, గత్యంతరం లేక ఇప్పుడు పనులు ప్రారంభిస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం అంశంలో కేసీఆర్‌పై చేసిన ఆరోపణలు నిరాధారమని ఈ తీర్పుతో స్పష్టమైందని, కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఈ తీర్పుతో కనువిప్పు కలగాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వేధింపులను పక్కన పెట్టి పాలనపై దృష్టి సారించి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆమె అన్నారు. న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందనే విశ్వాసానికి ఈ హైకోర్టు తీర్పు నిదర్శనమని పద్మా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు.

# పిఠాపురం ఘటనపై సిఎం చంద్రబాబు సీరియస్

### మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహారంపై అసహనం

### వర్మతో మాట్లాడాలని పల్లాకు బాబు ఆదేశం

**అమరావతి**

పిఠాపురంలో జరిగిన ప్రొటోకాల్ అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహారంపై ఘాటుగా స్పందించారు. ఈ ఘటనపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ, పార్టీ నేతలు ఐక్యంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై తెలుగుదేశం పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో సీఎం మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. టీడీపీ నేతలు ప్రొటోకాల్ పేరుతో, ఫ్లెక్సీల్లో ఫొటోల ప్రాధాన్యం కోసం ఘర్షణ పడటం సరికాదని సీఎం వ్యాఖ్యానించారు. పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ పాడా సమావేశం సందర్భంగా జరిగిన ఈ వివాదంలో మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహరించిన తీరు సరికాదని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పార్టీ నాయకులు ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన అవసరం ఉందని, ఇలాంటి సంఘటనలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని ఆయన పేర్కొన్నారు.ఈ ఘటనపై సీఎం చంద్రబాబు టీడీపీ నేతలకు కొన్ని కీలక సూచనలు చేశారు. ఏదైనా సమస్య ఉంటే పార్టీ పెద్దలకు లేదా ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ప్రత్యక్షంగా గొడవలు పడటం సరైన పద్ధతి కాదని తెలిపారు. ఇలాంటి ఘటనలు కేడర్‌కు తప్పుడు సంకేతాలు పంపుతాయని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హుకుం జారీ చేశారు. ఈ వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే వర్మకు తగిన సూచనలు ఇవ్వాలని పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. పార్టీ అంతర్గత క్రమశిక్షణను కాపాడాలని, నేతలు వ్యక్తిగత ప్రాధాన్యం కోసం పోటీ పడకూడదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పార్టీలో ఐక్యత, క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని.. వ్యక్తిగత ఘర్షణలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని సీఎం హెచ్చరించారు.

# నాదెండ్ల మృతికి సిఎం, డిప్యూటి సిఎం సంతాపం

### మనోహర్‌కు ఫోన్ చేసి పరామర్శించిన బాబు

**అమరావతి,**

మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు మృతిపట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ సంతాపం తెలిపారు. నాదెండ్ల ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భవవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు వారు తెలిపారు. భాస్కరరావు తనయుడు, మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఫోన్ చేసి పరామర్శించారు.. భాస్కరరావు కుటుంబసభ్యులకు సీఎం, మంత్రి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నాదెండ్ల భాస్కర రావు మృతిపై సంతాపం తెలిపారు. 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు తుది శ్వాస విడిచారని తెలిసి చింతిస్తున్నా. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను' అని డిప్యూటీ సీఎం పవన్ ఆవేదన చెందారు. నాదెండ్ల భాస్కరరావు 70వ దశకం నుంచి ప్రజా జీవితంలో ఉన్నారన్నారు. న్యాయవాదిగా, రాజకీయవేత్తగా ఆయనకున్న పరిజ్ఞానం ఎంతో విలువైనదని చెప్పుకొచ్చారు. విజయవాడ ఈస్ట్, వేమూరు నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేగా, ఖమ్మం నుంచి ఎంపీగా గెలిచి సేవలందించారని గుర్తుచేశారు. 'నాదెండ్ల భాస్కర రావు కుమారుడు, నా సహచర మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్.. పితృ వియోగం బాధ నుంచి త్వరగా కోలుకోవాలి' అని కాంక్షించారు. మనోహర్‌కు, ఇతర కుటుంబ సభ్యులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.------------------



# రూ.5,400 కోట్ల పెట్టుబడులతో రెన్యూ ఎనర్జీ గ్లోబల్

### అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఎనర్జీ ప్లాంట్

### శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి,**

ఆంధ్రప్రదేశ్ లోని రెన్యూవబుల్ రంగంలో భారీ పెట్టుబడులతో ఎనర్జీ ప్లాంట్ స్థాపించేందుకు ప్రముఖ రెన్యూ ఎనర్జ గ్లోబల్ సంస్థ ముందుకొచ్చింది. క్లీన్ ఎనర్జీ రంగంలోని ప్రధాన సంస్థల్లో ఒకటిగా ఉన్న రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఇప్పటికే దేశంలో 19.2 గిగావాట్ల సామర్థ్యంతో వివిధ ప్రాంతాల్లో క్లీన్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేసి ప్రముఖ స్థానంలో ఉంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ 6 గిగా వాట్లకు పైగా ఉత్పత్తి సామర్థ్యంతో క్లీన్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. దీంట్లో భాగంగా ఆ ప్లాంట్‌కు భూమి పూజ గురువారం జరగనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమి పూజ చేయనున్నారు. మొత్తంగా రూ.5,400 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేయబోయే సంస్థకు భూమి పూజ చేపట్టడంతో అనకాపల్లి జిల్లా అభివృద్ధికి కీలక అడుగులు పడనున్నాయి. డీకార్బనైజేషన్ రంగంలో ముందంజలో ఉన్న ఈ సంస్థ.. సుమారు రూ.4,200 కోట్ల పెట్టుబడితో 6 గిగావాట్ల సామర్థ్యం గల సోలార్ ఇంగాట్?వేఫర్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయబోతోంది. దీంతో పాటు మరో రూ.1,200 కోట్ల వ్యయంతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్ట్‌ను నిర్మించనుంది. ఈ రెండు ప్రాజెక్టులు వచ్చే రెండేళ్లలో పూర్తి కానున్నాయి. రెన్యూ సంస్థ నిర్మించే సోలార్ ఇంగాట్?వేఫర్ తయారీ యూనిట్, హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్టుల ద్వారా సుమారు 2,100 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. దీంతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభించనున్నాయి. రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీని భారీ ఎత్తున ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకెళ్తున్నారు. ఇంధన రంగం బలోపేతమైతే పారిశ్రామిక, వ్యవసాయ, సేవా రంగాలు వేగంగా వృద్ధి చెందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఏపీని రెన్యువబుల్ ఎనర్జీకి కేంద్రంగా నిలబెట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారు. గతేడాది నవంబర్‌లో విశాఖపట్నంలో జరిగిన సీఐఐ పార్టనర్ సమ్మిట్‌కు హాజరైన రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ రాష్ట్రంలో దశలవారీగా రూ.82,000 కోట్ల పెట్టుబడులు పెడతామని ప్రకటించింది. దీంట్లో భాగంగా అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఎనర్జీ ఎ÷-లాంట్ ఏర్పాటుకు పనులను ప్రారంభించనుండగా త్వరలోనే సుమారుగా రూ.22,000 కోట్లతో దేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ రిన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులలో ఒకదాన్ని అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ పక్రియ చేపట్టనుంది. 2014-19 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడే 2015లో కళ్యాణదుర్గం లో విండ్ ప్రాజెక్ట్‌తో రాష్ట్రంలోకి రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ అడుగుపెట్టింది. 717 మెగావాట్ల విండ్, 60 మెగావాట్ల సోలార్ ఎనర్జీ సామర్థ్యంతో ఏపీలోని రెన్యూ ఎనర్జీ గ్లోబల్ ఎ÷-లాంట్లు ఇప్పటికే పని చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉత్తరాంధ్రకు పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే ఆర్సెలార్ మిట్టల్, కాగ్నిజెంట్‌కు వంటి ప్రముఖ సంస్థలకు శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. టీసీఎస్ ఇప్పటికే




కార్యకలాపాలను ప్రారంభించింది. ఈ నెలలో అతిపెద్ద అంతర్జాతీయ పెట్టుబడి గూగుల్ సంస్థకు శంకుస్థాపన చేయనున్నారు. సాఫ్ట్ వేర్, ఎనర్జీ, స్టీల్, మెడ్ టెక్, ఫార్మా వంటి రంగాల్లో ఉత్తరాంధ్ర ప్రాంతం భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తోంది. అలాగే భోగాపురం ఎయిర్ పోర్టు త్వరలో అందుబాటులోకి రానుంది. మరోవైపు పర్యాటకంగా? ఆధ్యాత్మికంగా కూడా ఉత్తరాంధ్రలో అభివృద్ధి పెద్ద ఎత్తున చోటు చేసుకుంటోంది. ఉదయం 09.30 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి జెడ్.చింతువకు బయలుదేరి వెళతారు. 11.10 గంటలకు రెన్యూ గ్లోబల్ ఎనర్జీ సంస్థ శంకుస్థాపనలో కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమాన్ని ముగించుకుని మధ్యాహ్నం 02.35 గంటలకు అమరావతి చేరుకుంటారు.

అక్షర కలం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# ర్యాంకుల గోలతో విద్యార్థులపై ఒత్తిడి

**టీవీలు, పేపర్ల నిండా ర్యాంకుల గోల. మా వద్ద చదివిన వారికి ర్యాంకులే ర్యాంకులు అంటూ... ప్రకటనలు..1,2,3 ఇలా టీవీల్లో ఊదరగొడుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే...ర్యాంకుల గొడవలో పిల్లల్లో సృజనాత్మకతను దెబ్బతీస్తున్నారు. లక్షల్లో ఫీజులు వసూళ్లు చేసి, పేద మధ్యత తరగతి వారిని మాయలో పడేస్తున్నారు. ఇంతపెద్ద దేశంలో ఇలాంటి చదువులు సాగుతున్నందుకు సిగ్గుపడాలి. ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా భ్రష్టు పడుతోంది. ప్రభుత్వ హాస్టళ్లు నానాటికి తీసికట్టుగా తయారవుతున్నాయి. విద్యార్థులకు సరైన తిండి దక్కడం లేదు. ఫుడ్ పాయిజనింగ్‌తో చస్తున్నారు. అయినా పెద్దగా చర్యలు తీసుకోవడం లేదు. నానా రకాల పేర్లతో హాస్టళ్లు పెట్టి పిల్లలను ఘోష పెడుతున్నారు. ఇక ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజలు కట్టుకోలేనంత, తట్టుకోలేనంతగా ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడా లేదు. తల్లిదండ్రులు ధర్నాలు చేసినా, ఫీజలు భారం నుంచి తప్పించడం లేదు. జీవితమంటే చదువులు, మార్కులు, ర్యాంకులే అన్న విధంగా విద్యారంగం తయారయ్యింది. ప్రైవేట్ మాఫియాలో అసలు విద్య గంగలో కలసిపోతోంది. ర్యాకులే విజయానికి కొలమానాలుగా మారాయి.**

నేటి విద్యావిధానం మార్కులు, ర్యాంకుల చుట్టూనే తిరుగుతోంది. పిల్లల ప్రతిభను ఈ కొలమానంతో కొలవడం దారుణం. ర్యాంకుల వేటలో పిల్లల మానసిక ఒత్తిడిని పెంచుతున్నారు. ఇటీవలి కాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు సామాజిక సమస్యగా మారింది. చదివేది, పరీక్షలు రాసేదీ విద్యార్థులైతే, వాటి ఫలితాల కోసం ఎదురు చూసేది, వారి భవితపై అంచనాలు పెంచుకునేది వారి తల్లిదండ్రులు. వారి ర్యాంకులతో వ్యాపారం చేసేది ఆయా విద్యాసంస్థలు. ఈ ఒత్తిళ్ల మధ్య చదువులు, ర్యాంకుల వాతావరణానికి తోడు రకరకాల ఆర్థిక, సామాజిక, వివక్షల వంటి అనేక కారణాలు విద్యార్థుల్లో విపరీతమైన మానసిక సమస్యలను సృష్టిస్తున్నాయి. తల్లిదండ్రుల అంచనాల ను, విద్యాసంస్థల ఒత్తిళ్లను తట్టుకోలేక కుంగుబాటుతో, నిస్సహాయతతో కొందరు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. తాజాగా వచ్చిన ఇంటర్ ఫలితాల అనంతరం పదుల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పరీక్షల్లో ఫెయిలైతే జీవితం ముగిసిపోయినట్లే అన్న భావనలో..ఆత్మహత్యలే శరణ్యమని భావిస్తున్నారు. జీవితంలో చదువు, కెరీర్ ఒక భాగం మాత్రమే. అని వారికి అవగాహన కల్పించడం లేదు. మంచిచెడుల విచక్షణను తెలియజెప్పడం లేదు. ఇంటర్ ఫలితాలు వచ్చాక ఇటీవల తెలంగాణలో ఒక్క రోజులోనే ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే, ఎపి లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. టెన్త్, ఇంటర్ ఫలితాలొచ్చిన ప్రతిసారీ చిన్నారుల ఆత్మహత్యల వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. కార్పొరేట్ విద్యా ఫ్యాక్టరీలు ర్యాంకుల కోసం విద్యార్థులను యంత్రాల్లా మార్చుతున్నాయి. పిల్లలపై తల్లిదండ్రుల అంచనాలకు హద్దు లేకుండా పోతోంది. వారి అంచనాలను అందుకోలేక మరొకరితో పోల్చడాన్ని తట్టుకోలేక.. బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇవి కేవలం పిల్లల వ్యక్తిగత వైఫల్యాల ఫలితం కాదు. సమాజం, విద్యావ్యవస్థలోని లోపాలను ప్రతిబింబిస్తోంది. సుప్రీంకోర్టు సైతం ఇది వ్యవస్థాగత లోపానికి నిదర్శనం అని వ్యాఖ్యానించిందంటే.. పరిస్థితి తీవ్రత ఎంతగా వుందో అర్థం చేసుకోవచ్చు. పరీక్షల ఒత్తిడిలో వున్న పిల్లలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. వారికి మానసిక స్థయిర్యాన్ని ఇవ్వడం ముఖ్యం. మార్కులు, ర్యాంకుల కోసమే పుట్టలేదన్న విషయం పిల్లల్లో నూరిపోయాలి. ఫెయిలైతే మళ్లీ చదువుకునేందుకు అవకాశం ఉంది. అసలు చదువే ఇష్టం లేకపోతే అభిరుచి వున్న మరో రంగంలో సత్తా చాటడానికి విశాల ప్రపంచం ఉంది. తరగతి గదిలో వెనకబడిన వారు జీవితంలో అద్భుతాలు సాధించిన ఘటనలు అనేకం చరిత్రలో వున్నాయి. సచిన్ టెండుల్కర్, ధోనీ వంటి ప్రముఖ క్రికెటర్లు హైస్కూల్ చదువులతోనే సరిపెట్టుకున్నారు. ఇప్పుడు పేరున్న వారంతా అభిరుచి కలిగిన రంగంలో స్వయంకృషితో ఎదిగినవారే. ఇంటర్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయనో, పదిలో ఫెయిల్ అయ్యామనో తనువు చాలిస్తే భవిష్యత్‌లో దేశం ఒక గొప్పవ్యక్తిని కోల్పోయినట్టే. మన శ్రమతో కొత్త చరిత్రను



లిఖించాలి. ఇవన్నీ ఒక ఎత్తయితే విద్యారంగంలో సంస్కరణలు ముఖ్యం. ర్యాంకుల గోల, ఫీజలు గోల పోయేలా ప్రభుత్వరంగంలో స్కూళ్లను, కాలేజీలను బలోపేతం చేయాలి. ఒకేతరహా విద్య అందరికీ అందేలా చేయాలి. ముఖ్యమంగా ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలి. లక్షల్లో ఫీజులు వసూళ్ల దందాను ఆపాలి. అలాగే ర్యాంకుల చదవులను ఆపాలి. పలు తరహాల సిలబస్‌లకు బ్రేక్ వేయాలి. ప్రధానంగా ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేసి, టీచర్లను నియమిస్తే..పేదలు కార్పోరేట్ స్కూళ్ల మోజులో పడరు. వాటి వెనకాల పరుగెత్తరు. ఇది గుర్తించి ఉమ్మడి ఎపిలో ప్రభుత్వాలు చర్యలకు ఉపక్రమించాలి.

# భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి,, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23:**





వివిధ భూ సమస్యలపై భూభారతి రెవెన్యూ సదస్సులలో ప్రజలు అందించిన దరఖాస్తుల పరిష్కారం ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి భూ భారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, వివిధ రకాల భూ సమస్యలపై అర్జీదారులు అందించిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం దిశగా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని తెలిపారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని కన్నెపల్లి తహశీల్దార్ కార్యాలయాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్, కన్నెపల్లి మండల తహశీల్దార్ రామచందర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ లతో కలిసి సందర్శించి భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ, కార్యాలయ పరిధిలో జరిగిన రిజిస్ట్రేషన్ల రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి ప్రహరీ గోడ, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచసే విధంగా చర్యలు తీసుకోవాలని, పాఠశాలలో మూత్రశాల నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా చేపడుతున్న చర్యలలో భాగంగా జిల్లాలోని పాఠశాలలలో మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం నెన్నెల, తాండూర్ మండలాల తహశీల్దార్ల కార్యాలయాలను సందర్శించి ఆయా మండలాల తహశీల్దార్లు శ్రీనివాస్, జ్యోత్స్న లతో భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పరిశీలించి పరిష్కార ప్రక్రియ ప్రభుత్వా నబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. వివిధ పనుల నిమిత్తం ఆయా కార్యాలయాలకు వచ్చిన ప్రజలతో మాట్లాడి వారు వచ్చిన కారణాలను తెలుసుకొని దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు అనుగుణంగా అభివృద్ధి చేపట్టాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23:**



ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా భూమి అభివృద్ధి పనులు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తెలిపారు. గురువారం జిల్లాలోని చెన్నూరు పట్టణ పరిధిలో ఏర్పాటు చేస్తున్న లే అవుట్ స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, జిల్లా పట్టణ ప్రణాళిక అధికారి సంపత్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య మాట్లాడుతూ, లే అవుట్ పనులను ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్వహించాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువ వ్యవస్థ, ఉద్యానవనం, ఖాళీ స్థలం వంటి మౌలిక సదుపాయాలను ప్రామాణికంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. లేఅవుట్ ఆమోదంలో రికార్డులను సక్రమంగా పరిశీలించి ఎలాంటి లోపాలు లేకుండా పనులు పూర్తి చేయాలని, అనుమతుల ప్రకారం మాత్రమే అభివృద్ధి పనులు కొనసాగించాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా పనులు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ప్రధానమంత్రి -- అజయ్ పథకంలో ఎంపికైన మండలంలోని కత్తెరసాల గ్రామపంచాయతీ పరిధిలోని కత్తెరసాల, నర్సక్కపేట్, పాగేపల్లి గ్రామాలలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్, మండల పంచాయతీ అధికారి అజ్మత్ లతో కలిసి పర్యటించారు. గ్రామాలలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి కాలువల శుభ్రత, మురుగునీటి పారుదల వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. పగటి వేళల్లో వీధి దీపాలు వెలుగడాన్ని గమనించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి -- అజయ్ పథకం కింద ఎస్సి కాలనీలో ప్రతిపాదించిన మురుగు కాలువల పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని, కాలనీలో పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలోని తాగునీటి సరఫరా వ్యవస్థను పరిశీలించి దెబ్బతిన్న పైపుల కారణంగా నిలిచిపోయిన నీటి ట్యాంకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. నర్సక్కపేట్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి సౌకర్యాలను పరిశీలించి, పాఠశాల సరిహద్దు సమస్యపై పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎరువుల దుకాణం తనిఖీలో ట్రేడ్ లైసెన్స్ పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించి, వెంటనే బకాయిలను చెల్లించాలని యజమానికి సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం తోనే పేదవాడికి న్యాయం

### ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం -- పేదల కలలను నిజం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభించిన సిద్దిపేట నియోజక ఇంచార్జ్ పూజల హరికృష్ణ

### పేదింటి కల సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### గత బి ఆర్ స్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ పేరుతో పేదలను మోసం చేసింది



**అక్షర కలం సిద్దిపేట,ఏప్రిల్ 23:**

అర్హులు అయిన ప్రతి ఒక్కరికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందించి పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ పేర్కొన్నారు.గురువారం రోజున సిద్దిపేట రూరల్ మండలం తొర్నాల గ్రామంలో లబ్దిదారులు శనిగరం లక్ష్మీ,– శ్రీనివాస్ వాసూరి బాలవ్వ – యాదగిరి కొత్తూరి రేణుక – ధర్మయ్య దుంపటి దేవవ్వ – ఎల్లయ్య దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ గృహాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత బి ఆర్ స్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో పేదలకు తప్పుడు హామీలు ఇచ్చి పదేళ్ల పాటు మోసం చేసిందని తీవ్రంగా విమర్శించారు. ఎన్నో సంవత్సరాలు అధికారంలో ఉన్నా పేదల గృహ సమస్యను పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు.హరీష్ రావు పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు పేదల ఇళ్ల సమస్య ఎందుకు గుర్తు రాలేదు?" అని ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మాట నిలబెట్టుకుంటూ, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తూ వారి సొంతింటి కలను సాకారం చేస్తోందని స్పష్టం చేశారు. పేదలకు గృహ సౌకర్యం కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిక్కల మహేందర్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా వైస్ చైర్మన్ కొత్తూరి నరహరి గ్రామ శాఖ అధ్యక్షులు గూడ మహిపాల్, అంజిరెడ్డి, , గుడారి మల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,రాపి,,జిరెడ్డి,స్వామి, బాబు, బొమ్మల యాదగిరి, ముద్దం లక్ష్మి, పూజాల గోపికృష్ణ, ఎర్ర మహేందర్, ఏరాబోలు రాజిరెడ్డి, వాహబ్, రషద్, ఎల్లు శ్రీనివాస్ రెడ్డి గారు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల హక్కులకు అండగా డీఎల్ఎస్ఏ జడ్చర్ల ఓల్డ్ ఏజ్ హోంలో పరిశీలన

**మహబూబ్‌నగర్. ఏప్రిల్ 23 .అక్షర కలం**

: వృద్ధుల సంక్షేమం, హక్కుల పరిరక్షణపై జిల్లా న్యాయ సేవా సంస్థ దృష్టి సారించింది. రాష్ట్ర న్యాయ సేవా సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి డి. ఇందిరా గురువారం జడ్చర్లలోని ఓల్డ్ ఏజ్ హోంను సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధుల ఆరోగ్య పరిస్థితులు, నివాస సౌకర్యాలు, వారికి అందుతున్న సేవలను స్వయంగా పరిశీలించారు. అక్కడి నివాసితులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు. వృద్ధులకు తమ హక్కులపై అవగాహన కల్పిస్తూ, నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ అమలు చేస్తున్న 'సీనియర్ సిటిజన్' పథకం కింద లభించే చట్టపరమైన రక్షణలను వివరించారు. కుటుంబ సభ్యులు లేదా పిల్లలు పోషణ చేయని పరిస్థితుల్లో చట్టపరమైన చర్యలు తీసుకునే హక్కు వృద్ధులకు ఉందని స్పష్టం చేశారు. వృద్ధుల సమస్యల పరిష్కారానికి డీఎల్ఎస్ఏ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, అవసరమైన న్యాయ సహాయం ఉచితంగా అందిస్తామని కార్యదర్శి డి. ఇందిరా తెలిపారు.



# ఆర్టీసీ కార్మికులపై కక్షసాధింపు ధోరణి

### తాండూరులో టెంట్ సామాను ఇవ్వకుండా పోలీసుల ఒత్తిడి


### రేవంత్ సర్కార్ తీరుపై మండిపడ్డ తలసాని

**హైదరాబాద్, అక్షర కలం**

ఆర్టీసీ సంస్థను ప్రైవేట్ పరం చేసే దిశగా కుట్రలు చేస్తున్నదని మాజీమంత్రి శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామిలు ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. బీఆర్ఎస్ హయంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకొని వాటిని పరిష్కరించే దిశగా ఆ ఫైల్‌ను గవర్నర్ దగ్గరకు పంపించామని, తర్వాత ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు టెంట్ సామాన్లు ఇవ్వరాదని వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ పరిధిలో టెంట్ హౌస్ నిర్వాహకులను పోలీసులు నోటీసులు ఇవ్వడంపై డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ వెళ్లిన రేవంత్ రెడ్డి ఎన్డీయే కూటమి నేతలతో బ్రేక్ ఫాస్ట్ చేస్తుంటే తెలంగాణలో నిజమైన కాంగ్రెస్ నాయకులకు సోయి లేదా అంటూ ప్రశ్నించారు. కాళేశ్వరం కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.మేధా పర్వతం లాంటి కేసీఆర్‌పై ఉమ్మేస్తే తిరిగి కాంగ్రెస్ నాయకుల పైనే పడిందని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో నీళ్లు , నిధులు, నియామకాల ట్యాగ్ లైన్ తో తెలంగాణ ఉద్యమాన్ని నడిపి తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్‌అని పేర్కొన్నారు. వచ్చిన తెలంగాణలో రైతులు సంతోషంగా ఉండాలని ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం నిర్మించారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక బ్యారేజ్ మేడిగడ్డ . కాళేశ్వరం అంటే 100 కంపోనెట్లని, అందులో మేడిగడ్డ బ్యారేజ్ ఒకటని అన్నారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగిపోతే రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇద్దరు కలిసి లక్ష కోట్ల అవినీతి అంటూ తమ పై దుష్ప్రచారం చేశారని ఆరోపించారు. మేడిగడ్డలో కుంగిన రెండు పిల్లర్లను రిపేర్ చేస్తామని ఎల్అండ్‌టీ ముందుకు వస్తే బెదిరించారని తెలిపారు . మేడిగడ్డ కుంగినప్పుడు ఆగమేఘాల మీద వచ్చిన ఎన్డీఎస్ఏ , ఎస్ఎల్‌బీసీ కుంగి 8 మంది చనిపోతే ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చామని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా వరి ధాన్యం వచ్చింది.వచ్చిన ధాన్యం చూసి కేంద్రమే ఆశ్చర్యపోయింది. ఆఖరికి వరి కొనలేమని కేంద్రం చేతులెత్తేసిందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి పరిపాలన చేత కాదని, అన్ని వర్గాల వారు ప్రభుత్వం పై కోపంతో ఉన్నారని వెల్లడించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ , బీ ఆర్ఎస్ ఖైరతా బాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి , కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవ రెడ్డి , బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కె . కిషోర్ గౌడ్ పాల్గొన్నారు ,

అక్షరకలం
తెలుగు దినపత్రిక


# ఆట





## జెర్సీ రంగు మారినప్పటికీ

# జోరు తగ్గని కోహ్లీ





సాధారణంగా తమ సంప్రదాయ ఎరుపు రంగు జెర్సీలో అద్భుతాలు చేసే విరాట్ కోహ్లీ, ఆకుపచ్చ జెర్సీలో కూడా మంచి రికార్డులనే నమోదు చేశాడు. ఇప్పటివరకు గ్రీన్ జెర్సీలో 15 ఇన్నింగ్స్‌లు ఆడిన కింగ్ కోహ్లీ 142 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 522 పరుగులు సాధించాడు. ఇందులో ఐదు అర్ధ శతకాలు, ఒక అద్భుతమైన శతకం కూడా ఉన్నాయి. ఈ జెర్సీలో బరిలోకి దిగినప్పుడు అతడు ఏకంగా 32 ఫోర్లు, 24 సిక్సర్లు బాది అభిమానులను అలరించాడు. జట్టు జెర్సీ రంగు మారినప్పటికీ తన బ్యాటింగ్ జోరు తగ్గలేదని కోహ్లీ నిరూపించాడు.గ్రీన్ జెర్సీలో విరాట్ కోహ్లీ కెరీర్‌లోనే అత్యుత్తమ ఇన్నింగ్స్ 2016లో నమోదైంది. ఆ సీజన్‌లో రికార్డు స్థాయిలో 973 పరుగులు చేసి అద్భుతమైన ఫామ్‌లో ఉన్న కోహ్లీ.. గుజరాత్ లయన్స్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. తోటి ఆటగాడు ఏబీ డివిలియర్స్ తో కలిసి ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు. కేవలం 55 బంతుల్లోనే 198 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 109 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కోహ్లీ ఆడిన ఆ చారిత్రాత్మక ఇన్నింగ్స్ వల్ల ఆ మ్యాచ్‌లో ఆర్సీబీ 144 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. గ్రీన్ జెర్సీలో ఆర్సీబీకి లభించిన అతిపెద్ద విజయం ఇదే కావడం విశేషం.2013 నుంచి 2019 వరకు ఆకుపచ్చ జెర్సీలో అదరగొట్టిన కోహ్లీ, ఆ తర్వాత కొన్నేళ్ల పాటు కాస్త ఇబ్బంది పడ్డాడు. ముఖ్యంగా 2021 నుంచి 2024 మధ్య కాలంలో కోల్‌కతా, హైదరాబాద్, రాజస్థాన్ జట్లపై వరుసగా 5, 0, 0, 18 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు. ఈ నాలుగు మ్యాచ్‌లలో పరుగులు రాబట్టడంలో తీవ్రంగా తడబడ్డాడు.అయితే, 2025 సీజన్‌లో జైపూర్ వేదికగా రాజస్థాన్ రాయల్స్ పై మ్యాచ్ విన్నింగ్ అర్ధ శతకం సాధించి మళ్లీ తన లయ అందుకున్నాడు. తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా రెండు అద్భుతమైన షాట్లతో మంచి టచ్‌లో కనిపించినప్పటికీ.. 19 పరుగుల వద్ద లుంగీ ఎంగిడి బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో విరాట్ కోహ్లీ ప్రయాణం ఆసక్తికరంగా సాగుతోంది. టోర్నీలో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో కొనసాగుతున్న కోహ్లీ.. ఈసారి తన స్ట్రైక్ రేట్‌ను మెరుగుపరుచుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టాడు. ఇప్పటివరకు ఆడిన ఆరు మ్యాచ్‌లలో 158 స్ట్రైక్ రేట్‌తో 246 పరుగులు సాధించాడు. ఇందులో రెండు అర్ధ శతకాలు కూడా ఉన్నాయి. అయితే, జట్టు కోసం వేగంగా పరుగులు సాధించే క్రమంలో విరాట్ తరచూ 20 లేదా 30 పరుగుల వ్యవధిలోనే తన వికెట్ కోల్పోతుండటం గమనార్హం.

# తప్పుగా అర్థం చేసుకున్న నెటిజన్లు

### జర్మనీ మోడల్ లిజ్లాజ్ వివరణ

జర్మనీ మోడల్ లిజ్లాజ్ ఒక్క రోజులో సోషల్? మీడియాలో పాపులరైంది. స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి ఆమె పోస్టుకు లైక్ రావడంతో లిజ్లాజ్ పేరు ఒక్కసారిగా వైరల్? అయింది. ఆమె పోస్ట్?కు లైక్? కొట్టండంతో నెటిజన్లు కోహ్లీని ట్రోల్ చేస్తున్నారు. దీనిపై లిజ్లాజ్ స్పందిస్తూ కోహ్లీపై విమర్శలు రావడం తనకు బాధగా అనిపించిందని తెలిపింది.విరాట్? కోహ్లీ తన పోస్ట్?ని లైక్? చేసినందుకు చాలా సంతోషపడ్డానని లిజ్లాజ్? తెలిపింది. "విరాట్ కోహ్లీ నా ఫొటోని లైక్ చేసినప్పుడు ముందుగా నేనెంతో సంతోషించాను. ఆ తర్వాత ఆ పోస్ట్‌ని ఆయన అన్‌లైక్ చేశారు. అనుకోకుండా నేను పాపులర్ అయినందుకు ఆనందమే కానీ, తర్వాత బాధగా అనిపించింది. ఈ ఒక్క లైక్ సోషల్ మీడియాలో ఇంత పెద్ద స్టోరీ అవుతుందని అనుకోలేదు. నా ఫోటోని కోహ్లీ లైక్? చేసినందకు ఇంతగా ట్రోల్ చేస్తారనుకోలేదు. ఆ లైక్ వెనక కోహ్లీకి ఏ దురుద్దేశం లేకపోయినా నెటిజన్లు తప్పుగా అర్థం చేసుకున్నారు. ఏదేమైనా నా ఫొటోని స్టార్ క్రికెటర్ లైక్ చేసినందుకు గర్వంగా అనిపించింది" అని లిజ్లాజ్ పేర్కొంది. ఈ జర్మనీ మోడల్ లిజ్లాజ్? ఐపీఎల్ మ్యాచ్‌లను తెగ ఇష్టపడుతుంది. అందులోనూ ఆర్సీబీకి వీరాభిమాని అని గతంలో చెప్పింది. తాజాగా లిజ్లాజ్ ఆర్సీబీ జెర్సీ ధరించి పాటపాడుతున్న ఓ వీడియోని ఇన్‌స్టాలో పోస్టు చేసింది. దీంతో నెటిజన్లు 'ఆర్సీబీ తదుపరి ఆడనున్న మ్యాచ్‌కి మీరు వస్తున్నారా?' అంటూ ఆ వీడియోకు నెటిజన్ కామెంట్ పెట్టారు. 'కచ్చితంగా ఒక రోజ వస్తాను' అని లిజ్లాజ్ ఆ కామెంట్?కు రిప్లై ఇచ్చింది.లిజ్లాజ్ జనవరి 30న తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలను షేర్ చేసింది. గోల్డెన్ అవర్ షాట్స్ అంటూ సూర్యాస్తమయం వేళ దిగిన ఆ ఫొటోలకు విరాట్ కోహ్లీ లైక్ కొట్టినట్లు నెటిజన్లు గుర్తించారు. ఈ వార్త బయటకు రాగానే అసలు ఈ లిజ్లాజ్ ఎవరు? అని గూగుల్ చేయడం మొదలుపెట్టారు. లిజ్లాజ్ జర్మనీకి చెందిన ఒక వ్లాగర్ ,సింగర్ అని తెలుసుకున్నారు. ఈమె ఎంఎస్సీ సైకాలజీ పూర్తి చేసింది. ఇన్?స్టాగ్రామ్?లో ఆమెకు సుమారు 4.27 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. విరాట్ కోహ్లీ లాంటి సెలబ్రిటీలు పొరపాటున స్క్రీన్ స్క్రోల్ చేస్తున్నప్పుడు లైక్ బటన్ ప్రెస్ అయ్యే అవకాశం ఉందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. మరికొందరు మాత్రం విరాట్ కోహ్లీ అంతర్జాతీయ స్థాయి సెలబ్రిటీ కాబట్టి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ రంగాల వారిని ఆయన ఫాలో అవుతుంటారని, అందులో భాగంగానే లైక్ కొట్టి ఉండొచ్చని అంటున్నారు. ఏది ఏమైనా, ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ నడుస్తున్న వేళ కోహ్లీకి సంబంధించిన ఈ చిన్న విషయం కూడా పెద్ద సెన్సేషన్?గా మారింది.భారతీయ సంస్కృతీ సంప్రదాయాల్ని ఇష్టపడే విదేశీయులు చాలామందే ఉన్నారు. తానూ ఈ జాబితాలో ఉన్నానంటోంది లిజ్లాజ్. ఆమెకు మన దేశమంటే ఎంతిష్టమంటే ఇప్పటికే ఇక్కడి కట్టూ-బొట్టును నేర్చుకుంది. సంస్కృతీ సంప్రదాయాల్ని ఒంటబట్టించుకుంది. ఆమె భారత పర్యటనకు వచ్చిన ప్రతిసారీ వారాలు, కొన్నిసార్లు నెలల తరబడి ఇక్కడే ఉండేందుకు ఆసక్తి చూపుతుంది. దిల్లీ, ముంబయి, బెంగళూరు, గోవా ఇలా ఇప్పటికే చాలా ప్రదేశాలను చుట్టేసింది. ఇక్కడి దేవాలయాలను దర్శించుకుంటుంది. పెళ్లిళ్లకూ హాజరవుతుంటుంది. చీర కట్టుకొని, బొట్టు పెట్టుకొని సంప్రదాయబద్ధంగా తయారవడమంటే తనకు ఇష్టమని చెప్పింది. తన ఇన్‌స్టా పేజీలో పోస్ట్ చేసే ట్రావెల్ కంటెంట్‌లో ఇండియా టూర్‌కు సంబంధించినవే ఎక్కువగా ఉంటాయి.

అక్షరకలం
తెలుగు దినపత్రిక





# సినిమా

CINEMA

# నన్ను నమ్మి..నడిపించిన నా దేవత

### భార్య రహస్య గోరఖ్‌పై కిరణ్ ప్రశంసలు

యువ హీరో కిరణ్ అబ్బవరం ఇప్పుడు నిర్మాతగా కొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. కేఏ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆయన సమర్పణలో రూపొందిన 'తిమ్మరాజుపల్లి టీవీ' చిత్రం ఏప్రిల్ 17న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా ద్వారా కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించాలనే లక్ష్యంతో సుమారు 25 మందికి పైగా కొత్త నటీనటులను, దర్శకుడు వి. మునిరాజ్‌ని పరిశ్రమకు పరిచయం చేస్తున్నారు. విభిన్నమైన కథాంశంతో రూపొందిన ఈ చిత్రం ఇప్పటికే ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇటీవల జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్ ఎంతో భావోద్వేగభరితంగా సాగింది. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం చేసిన ప్రసంగం అందరినీ కదిలించింది. 'ఈ సినిమా కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు.. పల్లెల నుంచి పెద్ద కలలతో వచ్చిన సుమారు 50 మంది టెక్నీషియన్లు, నటీనటుల జీవిత స్వప్నం' అని ఆయన తెలిపారు. తన కెరీర్‌లో ఇప్పటివరకు ఎవరినీ సహాయం కోరలేదని చెప్పిన కిరణ్, ఈసారి మాత్రం కొత్తవారి కష్టానికి గుర్తింపు రావాలనే ఉద్దేశంతో పరిశ్రమ పెద్దలు, విమర్శకులు ఈ సినిమాను ఆదరించాలని కోరారు. ఈ వేడుకలో ఆయన తన భార్య, నటి రహస్య గోరఖ్ గురించి చేసిన వ్యాఖ్యలు ప్రత్యేకంగా నిలిచాయి. తాను హీరో కాకముందు ఎదుర్కొన్న కష్టాలను గుర్తు చేసుకుంటూ, ఆ సమయంలో రహస్య తనకు అండగా నిలిచిందని చెప్పారు. అవకాశాల కోసం తిరిగిన రోజుల్లో కూడా ఆమె నన్ను నమ్మింది. తినడానికి కూడా కష్టమైన సమయంలో ఇంటి నుండి భోజనం తీసుకువచ్చి నన్ను ఆదుకుంది. నేను హీరో అవుతానని విశ్వసించి నా చేయి పట్టుకుంది అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. చిన్న సినిమా అయినప్పటికీ టెక్నికల్ పరంగా ఎక్కడా రాజీ పడలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ చిత్ర బృందం కష్టానికి గుర్తింపుగా, వారి కుటుంబ సభ్యుల కోసం భారతదేశంలోనే అతిపెద్ద స్క్రీన్‌పై స్పెషల్ ప్రీమియర్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం విశేషం.



## సల్మాన్ వంశీ

# పైడిపల్లి మూవీ

బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ మరియు టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ శనివారం పట్టాలెక్కింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై అగ్ర నిర్మాత దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం రెగ్యులర్ షూటింగ్ నేటి నుంచి ప్రారంభమైనట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రాజెక్టులో 'లేడీ సూపర్ స్టార్' నయనతార కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకాయి. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్, వంశీ పైడిపల్లి డైరెక్షన్‌లో నటించడం ఇదే మొదటిసారి కావడంతో ఈ పాన్-ఇండియా చిత్రంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ నెలనుంచే షూటింగ్ మొదలవుతుందని గతంలోనే ప్రకటించిన చిత్ర బృందం, ఈరోజు నుంచి కెమెరా ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించింది. యాక్షన్ మరియు ఎమోషన్స్ కలయికగా రానున్న ఈ చిత్రం 2027 ప్రథమార్థంలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

# బాలయ్యతో కొరటాల శివ మూవీ

ప్రస్తుతం కొరటాల శివ ఫోకస్ అంతా 'దేవర' సీక్వెల్ పైనే ఉందని అందరూ అనుకున్నారు. కానీ ఎన్టీఆర్ బిజీగా ఉండడంతో కుదరడం లేదు. ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ సినిమాతో బిజీగా ఉన్నారు. ఆ ప్రాజెక్ట్ పూర్తయి 'దేవర-2' మొదలవ్వడానికి కనీసం ఏడాది నుంచి ఏడాదిన్నర సమయం పట్టేలా ఉంది. ఈ ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా, కొరటాల ఒక పవర్ ఫుల్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారట. ఇప్పటికే ఈ కథను బాలయ్యకు వినిపించడం, దానికి ఆయన గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం కూడా జరిగిపోయాయని సమాచారం. అయితే నందమూరి అభిమానుల్లో మెదులుతున్న ప్రశ్న ఏంటంటే.. దేవర 2 కంటే ముందే ఈ సినిమా ఉంటుందా అంటే అవుననే అంటున్నాయి టాలీవుడ్ వర్గాలు. ఎన్టీఆర్ డేట్స్ దొరికే వరకు వేచి చూడకుండా, బాలయ్యతో ఒక సెన్సేషనల్ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని కొరటాల భావిస్తున్నారు. ఇది టాలీవుడ్ వరకు పరిమితమవుతుందా లేక పాన్ ఇండియా రేంజ్‌లో ఉంటుందా అనే క్లారిటీ రావాల్సి ఉంది. అయితే బాలయ్య క్రేజ్ ఇప్పుడు నేషనల్ లెవల్‌లో ఉంది కాబట్టి, ఇది భారీ లెవల్‌లోనే ఉండే అవకాశం ఉంది. బాలయ్య లైనప్ చూస్తుంటే ఫ్యాన్స్‌కు పూనకాలు రావడం ఖాయం. ఇప్పటికే గోపీచంద్ మలినేనితో ఒక సినిమా పట్టాలెక్కనుంది. అలాగే వివేక్ ఆత్రేయ, క్రిష్ వంటి దర్శకులతో సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. ఈ గ్యాప్‌లో కొరటాల శివ సినిమా ఎప్పుడు సెట్స్ పైకి వెళ్తుంది..? ఒకవేళ ఈ సినిమా గనుక మొదలైతే, కొరటాల శివ దర్శకత్వంలో చేయబోయే దేవర-2 మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉందా అనేది తెలియాల్సి ఉంది. బాలయ్య మార్క్ యాక్షన్.. కొరటాల మార్క్ సోషల్ మెసేజ్ కలిసి బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సంచలనాలు సృష్టిస్తాయో చూడాలి. మరి ఎన్టీఆర్ కంటే ముందే కొరటాల బాలయ్య సినిమాను పూర్తి చేస్తారా..? ఈ సినిమా పై అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుంది..? అనే విషయాలు తెలియాలంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే. మన బాలయ్య ఊపు చూస్తుంటే ఏదైనా సాధ్యమే అనిపిస్తోంది.





అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# కూతుళ్ల భవిష్యత్తుపై తల్లిదండ్రులకు అవగాహన

## ---ప్రిన్సిపాల్ డాక్టర్ హరిప్రియ




అక్షరకలం దేవరకొండ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా స్థానిక తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో సంక్షేమ వారోత్సవాలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల తల్లిదండ్రులు, అధ్యాపక బృందంతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. హరిప్రియ మాట్లాడుతూ.. విద్యార్థినుల విద్యా ప్రగతిని వివరించారు. డిగ్రీ అనంతరం విద్యార్థినులకు ఉండే వివిధ ఉద్యోగ అవకాశాల గురించి, కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, కొత్త అడ్మిషన్ల ప్రక్రియపై తల్లిదండ్రులకు సమగ్ర అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినుల తల్లిదండ్రులను కళాశాల తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో ప్రధానంగా.. కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి, వివిధ కంపెనీల ప్రాంగణ నియామకాల్లో (క్యాంపస్ ప్లేసెమెంట్స్ ) ఎంపికైన విద్యార్థినులకు వారి తల్లిదండ్రుల సమక్షంలోనే నియామక పత్రాలను (ఆఫర్ లెటర్స్ ) అందజేశారు. తమ బిడ్డలు ఉన్నత స్థాయి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రవి నాయక్ మాట్లాడుతూ.. తన సొంత అనుభవాలను పంచుకున్నారు. ఇదే కళాశాలలో చదివిన తన కుమార్తెలు విద్యాపరంగా, వృత్తిపరంగా సాధించిన అభివృద్ధిని వివరిస్తూ, ఈ కళాశాల గిరిజన విద్యార్థినుల జీవితాల్లో వెలుగులు నింపుతోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కమిటీ సభ్యులు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినులు,వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు జాతీయ పంచాయతీ రాజ్ ఆవిర్భావ దినోత్సవం

### మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థ తో అమల్లో ఉంది





యాదాద్రి భువనగిరి అక్షర కలం

భారత రాజ్యాంగ 73 వ సవరణ చట్టం ద్వారా 1992 ఎప్రిల్ 24 న జాతీయ పంచాయతీ రాజ్ చట్టం వచ్చినా, అది 1993 నుంచి పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చింది. ఆరోజు నుంచే స్థానికుల పాలనకు రాచభాటలు వేసిందని చెప్పవచ్చు, స్థానిక సంస్థలను బలోపేతం చేయడానికి ఈ చట్టం దోహదం చేస్తుందనుటలో ఎలాంటి సందేహం లేదు.ఈ చట్టం ద్వారా స్థానిక సంస్థల స్వయం పాలనకు ప్రతి రూపాలుగా నిలుస్తున్నాయి. పంచాయతీ రాజ్ వ్యవస్థ లో గ్రామీణాభివృద్ధి, అట్టడుగు వర్గాల సంక్షేమం, సమన్యాయం, మహిళా వికాసం, మహిళా సాధికారత, పరిపాలన వికేంద్రీకరణ, ఈ పరిపాలన వినియోగం, స్థానికుల్లో ఉత్పత్తి సామర్థ్యం పెంచడం, అర్థిక చేయూత ఇవ్వడం మొదలైనవి పంచాయతీరాజ్ వ్యవస్థ లో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. నేటి పంచాయతీ రాజ్ వ్యవస్థ లో మూడంచెల వ్యవస్థ అమల్లో ఉంది. దేశ వ్యాప్తంగా 2. 63 లక్షల పంచాయతీల్లో 31.47 లక్షల ఎన్నికైన అభ్యర్థులు అందులో 14.54 లక్షల మహిళలు భాగస్వామ్యంతో ఉండడం విశేషం. నేటి పంచాయతీ రాజ్ వ్యవస్థ మరింత మెరుగైన సేవలు అందించాలని సామాన్యులు కోరుతున్నారు. స్థానిక సంస్థలు బలపడితేనే పట్టణానికి వెళ్ళే వలసలు తగ్గుతాయి. సమ్మిళిత గ్రామీణాభివృద్ధికి బాటలు పడతాయి.

# గొట్టి ముక్కల అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా 'పోషణ పక్షం --- సూపర్వైజర్ చిట్టెమ్మ



అక్షరకలం దేవరకొండ

దేవరకొండ మండల పరిధిలోని గొట్టిముక్కల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం 'పోషణ పక్షం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ డి. చిట్టెమ్మ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నిత్యం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సిరి ధాన్యాలు, చిరు ధాన్యాలతో పాటు స్థానికంగా లభించే ఆకుకూరలు, కాయగూరలు, పండ్లను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. పిల్లల ఎదుగుదలలో మొదటి 1000 రోజుల ప్రాముఖ్యతను ఆమె వివరించారు. 3 నుండి 6 ఏళ్ల వయసులో చిన్నారుల మెదడు 90 శాతం అభివృద్ధి చెందుతుందని, ఈ సమయంలో వారికి తగిన అవకాశాలు, పౌష్టికాహారం అందించడం ద్వారా వారి భవిష్యత్తు బాగుంటుందని పేర్కొన్నారు. అనంతరం డి.సి.పి.యు (డీసీ పి యూ ) యూనిట్ మెంబర్ అంజలి మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహాలు చేసే తల్లిదండ్రులకు, ప్రోత్సహించే వారికి కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. గ్రామ సర్పంచ్ ఎరుకలి పార్వతీ వెంకటేష్ మాట్లాడుతూ.. ఆరేళ్లలోపు పిల్లలందరినీ అంగన్‌వాడీలకు పంపించాలని కోరారు. ప్రభుత్వం సరఫరా చేసే బాలామృతం, బాలామృతం ప్లస్, గుడ్లు వంటి పోషకాహారాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి అనిత, ఉపసర్పంచ్ మాచెర్ల వెంకటయ్య, యూత్ కాంగ్రెస్ దేవరకొండ మండల అధ్యక్షుడు ముకురోజు రాజు, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, అలివేలు, వనిత, చిట్టి, ఆశా కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

# ధూమపానం చేయని వారిలోనూ పెరుగుతున్న "ఊపిరితిత్తుల" క్యాన్సర్

### --- యశోద హాస్పిటల్స్ నిపుణుల హెచ్చరిక

అక్షరకలం నల్గొండ

సాధారణంగా ఊపిరితిత్తుల క్యాన్సర్ అంటే కేవలం ధూమపానం చేసేవారికి మాత్రమే వస్తుందనే అంచనా ఉంటుంది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ధూమపానం చేయని వారు, ముఖ్యంగా యువతలో కూడా ఈ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయని సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ ఆంకాలజిస్ట్ వైద్య నిపుణులు డాక్టర్ హరీష్ కాంచర్లఆందోళన వ్యక్తం చేశారు. గురువారం నల్గొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వంశపారంపర్యంగా వచ్చే క్యాన్సర్లు కూడా ఇందుకు ఒక ప్రధాన కారణమని వారు పేర్కొన్నారు. మారుతున్న జీవనశైలి, పర్యావరణ కాలుష్యం, శరీరంలోని జన్యు ఉత్పరివర్తనలు ఈ వ్యాధి వ్యాప్తికి ప్రధాన కారకాలుగా మారుతున్నాయి. వీటిని ముందుగానే గుర్తించేందుకు అధునాతన సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని వైద్యులు తెలిపారు. దీని ద్వారా జన్యువులలోని మార్పులను సూక్ష్మంగా పరిశీలించవచ్చు. వ్యాధి తీవ్రతను, రకాన్ని వేగంగా నిర్ధారించేందుకు ఇవి దోహదపడతాయి.? ఒక సాధారణ రక్త పరీక్ష ద్వారా క్యాన్సర్ ముప్పు ఉన్న కుటుంబ సభ్యులకు ముందస్తు స్క్రీనింగ్ నిర్వహించే వీలుంది. గతంలో ఊపిరితిత్తుల క్యాన్సర్ అంటే భయాందోళనలు ఉండేవని, కానీ ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునోథెరపీ వంటి చికిత్సల వల్ల రోగుల మనుగడ రేటు పెరగడమే కాకుండా, వారి జీవన నాణ్యత కూడా మెరుగుపడుతోందని నిపుణులు వెల్లడించారు.?"ప్రస్తుతం యువతలో, ఎప్పుడూ ధూమపానం చేయని వారిలో కూడా క్యాన్సర్ కేసులు కనిపిస్తున్నాయి. అధునాతన పరీక్షల సాయంతో ప్రతి రోగికి అవసరమైన పర్సనలైజ్డ్ మెడిసిన్ (వ్యక్తిగతీకరించిన వైద్యం) అందించగలుగుతున్నాం. లక్షణాలు బయటపడకముందే స్క్రీనింగ్ చేయించుకోవడం వల్ల చికిత్స ఫలితాలు చాలా మెరుగ్గా ఉంటాయని పేర్కొన్నారు. కుటుంబంలో ఎవరికైనా క్యాన్సర్ చరిత్ర ఉన్నట్లయితే, మిగిలిన వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అటువంటి వారు తగిన జన్యు సలహాలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయించుకోవడం ద్వారా ప్రాణాపాయం నుండి తప్పించుకోవచ్చని తెలిపారు.




# రత్య తండాలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన ఎమ్మెల్యే



అక్షరకలం దేవరకొండ

దేవరకొండ మండల పరిధిలోని రత్య తండాలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నేడు రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కొండమల్లేపల్లి మండలంలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్' నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో కోల్ ముంతల్ పహాడ్ రైతు వేదిక వద్ద జరుగుతున్న బహిరంగ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అసాధ్యమైన పనిని సాధించడానికి నిదర్శనం భగీరథుడు..జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23:



నిరంతర ప్రయత్నం, అంకితభావం ఉంటే అసాధ్యమైన పనిని సాధించవచ్చు అని చూపిన మహనీయుడు భగీరథుడు అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీ భగీరథ మహర్షి జయంతి ఉత్సవానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి హాజరై, భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, కష్టతరమైన పనిని సాధించడానికి భగీరథ మహర్షిని స్ఫూర్తిగా చూపిస్తామని, తరాలు మారిన భగీరథుడు సాధించిన విజయాన్ని స్మరిస్తూ ఉంటామని తెలిపారు. తలపెట్టిన పనిని పూర్తి చేసే వరకు ఎంత కాలమైనా అంకితభావంతో ప్రయత్నించాలని, భగీరథుడు ఆచరించి చూపారని తెలిపారు. మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడంలో భాగంగా ప్రభుత్వం అధికారికంగా వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# డాక్టర్ల గైర్హాజరు పట్ల "కలెక్టర్" ఆగ్రహం

### వైద్యులు, రోగులకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశం

### హుజుర్ నగర్ ఏరియా ఆసుపత్రికి ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

### తనిఖీ సమయంలో అందుబాటులో లేని డాక్టర్లు

### తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




అక్షరకలం హుజూర్ నగర్

ప్రభుత్వ ఆసుపత్రిలలో వైద్యులు రోగులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని, లేదంటే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. గురువారం హుజుర్ నగర్ (ప్రాంతీయ వైద్యశాల) ఏరియా ఆసుపత్రికి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ఆసుపత్రిని తనిఖీ చేసిన సమయంలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత మంది సమయం కాకముందే విధుల నుంచి వెళ్లిపోవడంపై కలెక్టర్ వివరాలను ఆరా తీశారు. అనంతరం డయాలసిస్ కేంద్రం, బ్లడ్ బాంక్ కేంద్రలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు విధి నిర్వహణలో సమయానికి రోగులకు అందుబాటులో ఉండాలని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఓపి విభాగంలో సమయపాలన పాటించని డాక్టర్లను, కాంట్రాక్టు డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సంబంధిత సూపరెండేంట్ ని ఆదేశించారు. ఇందుకు సంబంధించి పూర్తి నివేదికను అందించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని. సాధారణ ప్రసవాలు అధికంగా జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్య నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పారిశుధ్య నిర్వహణపై శానిటేషన్ సిబ్బందిని, నర్సింగ్ ఆఫీసర్లను అభినందించారు. మెరుగ్గా పారిశుధ్య పనులను నిర్వహించి ఆసుపత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలోని అత్యవసర విభాగం, ఓపి విభాగం, బ్లడ్ స్టోరేజి విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న ఓపి బ్లాక్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సిటీ స్కాన్ మిషన్ పని తీరును పర్యవేక్షించారు. టి హబ్ నిర్వహణలో ఉన్న లోపాలను అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యను పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, సూపరెండేంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ రవి కుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ వనజ, వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు, శానిటేషన్ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# కాంగ్రెస్ "గోబెల్స్" ప్రచారానికి హైకోర్టు తీర్పు చెంపపెట్టు

## కేసీఆర్, హరీష్‌రావులను బదనాం చేసే కుట్రలు పటాపంచలు

## కాళేశ్వరంపై దుష్ప్రచారం ఆపి.. రైతులను ఆదుకోండి

## నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ నేతల ధ్వజం

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారాలకు, రాజకీయ కక్షసాధింపు చర్యలకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిదని బీఆర్ఎస్ జిల్లా నేతలు పేర్కొన్నారు. గురువారం నల్లగొండలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో జిల్లా అధ్యక్షులు రవీంద్ర కుమార్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య తదితరులు మాట్లాడారు. హైకోర్టు తీర్పుతో నిజం నిలబడిందని పేర్కొన్నారు.?పీసీ ఘోష్ కమిషన్ విచారణ సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని హైకోర్టు తేల్చడం ద్వారా కాంగ్రెస్ కుట్రలు బయటపడ్డాయని నేతలు విమర్శించారు. బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ నాయక్ మాట్లాడుతూ గాంధీ భవన్ లో రాసిచ్చిన స్క్రిప్ట్ ప్రకారం కేసీఆర్, హరీష్ రావులను ఇబ్బంది పెట్టాలని చూశారు. మెడిగడ్డలో రెండు పిల్లర్లు దెబ్బతింటే ప్రాజెక్టు మొత్తం కూలిపోయిందని 37 లక్షల ఎకరాల ఆయకట్టును అభాసుపాలు చేశారని మండిపడ్డారు. ఎమ్మెల్సీ?కోటిరెడ్డి మాట్లాడుతూ ఆధారాలు లేని ఆరోపణలు చట్టం ముందు నిలబడవని మరోసారి స్పష్టమైంది. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా డైవర్షన్ పాలిటిక్స్ మానుకోవాలని హితవు పలికారు.జిల్లా ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని,పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో డిండి ఎత్తిపోతల పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని నేతలు ఆరోపించారు. వట్టెం నుండి డిండికి వచ్చే కాల్వ ఎత్తు పెంచడం వల్ల జిల్లా రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందని, జిల్లాకు చెందిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దీనిపై మౌనం వీడాలని డిమాండ్ చేశారు. మాజీ జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితి దారుణంగా ఉందని మండిపడ్డారు."పంట కొనుగోళ్లు లేవు, కరెంట్ రాదు, యూరియా దొరకదు. క్వింటాలుకు 8 నుంచి 9 కిలోల తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారు. నేటి నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు అండగా ఉంటాం. అవసరమైతే కలెక్టరేట్ ముట్టడిస్తామని స్పష్టం చేశారు. అయితే ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంఘీభావం ప్రకటించిన నేతలు, ప్రభుత్వం తక్షణమే వారి హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నోముల భగత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# దేవరకొండలో స్తంభించిన రవాణా.. రెండో రోజుకు చేరిన ఆర్టీసీ సమ్మె



అక్షరకలం దేవరకొండ,

ఆర్టీసీ కార్మికుల సమ్మెతో దేవరకొండ డిపో పరిధిలో రవాణా వ్యవస్థ రెండో రోజూ పూర్తిగా స్తంభించిపోయింది. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా కార్మికులు చేపట్టిన ఈ ఆందోళన గురువారం నాటికి ఉధృత రూపం దాల్చింది. బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గురువారం తెల్లవారుజాము నుంచే కార్మికులు దేవరకొండ డిపో ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ మొండి వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మిక నేతలు మాట్లాడుతూ.. ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని, పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు తెలంగాణ జాగృతి నాయకులు తమ పూర్తి మద్దతు ప్రకటించారు. సమ్మె శిబిరాన్ని సందర్శించిన నాయకులు.. కార్మికుల డిమాండ్లు న్యాయమైనవని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు, వివిధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు డివైఎఫ్ఐ సంపూర్ణ మద్దతు



అక్షర కలం చిట్యాల

తెలంగాణ రాష్ట్రంలో తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య సంపూర్ణ మద్దతు ప్రకటించింది. గురువారం నాడు చిట్యాలలో నిర్వహించిన డివైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి వడ్డగాని మహేష్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ?గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేసినప్పుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి అండగా నిలిచి, అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని మహేష్ గుర్తు చేశారు. కానీ నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వాగ్దానాలను విస్మరించి, కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడం దుర్మార్గమైన చర్య అని ఆయన మండిపడ్డారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆర్టీసీని పూర్తిగా ప్రభుత్వంలో విలీనం చేయాలి ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించకుండా, ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి నడపాలి. కార్మికులు కొత్త కోర్కెలేవీ కోరడం లేదని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తేనే సమ్మె విరమిస్తారని స్పష్టం చేశారు ? ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు పంది నరేష్, పట్టణ కార్యదర్శి అవిశెట్టి కిరణ్, మండల ఉపాధ్యక్షులు కూనూరు గణేష్, గోలి సాయి కిరణ్, కొంపల్లి భరత్, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తల్లిదండ్రుల ఆత్మీయ సమ్మేళనం..

## ప్రతిభావంతులకు సన్మానం....పాఠశాల ప్రిన్సిపల్ రవికుమార్

అక్షర కలం నాగార్జునసాగర్ / నందికొండ

నాగార్జునసాగర్ బీసీ గురుకుల పాఠశాలలో జరిగిన ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ రవికుమార్ పాల్గొన్నారు,ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో మన పాఠశాల నుండి ఎస్.ఓ.ఈ,కి కేవలం ఒకరిద్దరు మాత్రమే ఎంపికయ్యేవారు కానీ ఈ విద్యా సంవత్సరంలో మన విద్యార్థులు రికార్డు స్థాయిలో 14 మంది విద్యార్థులు ఎంపిక కావడం మనందరికీ గర్వకారణం. విద్యార్థులకు



నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడంలో మన బీసీ గురుకుల విద్యాలయాల సొసైటీ సెక్రటరీ సైదులు,అందిస్తున్న సహకారం మరువలేనిది.వారి ప్రోత్సాహం వల్లే ఈరోజు మనం ఇలాంటి ఉత్తమ ఫలితాలను సాధించగలిగాం,ప్రస్తుతం ఎండలు చాలా తీవ్రంగా ఉన్నాయి,విద్యార్థులంతా ఉదయం10 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఎండలోకి రాకుండా వడదెబ్బ తగలకుండా ఇంట్లోనే ఉంటూ మజ్జిగ, నిమ్మరసం,కొబ్బరి నీళ్లు వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలి.సెలవుల్లో చదువుపై పట్టు కోల్పోవద్దు.రోజుకు కనీసం రెండు గంటలు పుస్తకాలతో గడపండి.అని ప్రిన్సిపల్ పేర్కొన్నారు,ఈ కార్యక్రమంలో ఏటీపీలు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు,



# అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన మహనీయుడు

## పట్టుదలకు మారుపేరు భగీరథ మహర్షి

## జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

## ఘనంగా జయంతి వేడుకలు

## సగర సామాజిక వర్గానికి సంక్షేమ ఫలాలు అందజేస్తాం.. కలెక్టర్ హామీ

అక్షరకలం నల్గొండ

పట్టుదలకు మారుపేరు భగీరథ మహర్షి అని జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలోభగీరథ మహర్షి జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. కఠోర దీక్ష, పట్టుదలతో గంగను దివి నుండి భువికి తీసుకువచ్చి ప్రపంచాన్ని సస్యశ్యామలం చేసిన మహనీయుడని అన్నారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, భవితరాలకు ఆ స్ఫూర్తిని అందించాల్సిన అవసరం ఉందన్నారు. సబ్బండ వర్గాల ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు చేరవేయడం ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ అన్నారు. పనిలో అవరోధాలు వచ్చినా వాటిని ధైర్యంగా ఎదుర్కొని కృషి చేస్తే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని భగీరథ మహర్షిని ఉదాహరణగా చెబుతారని అన్నారు.అర్హులకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో సగర సంఘశీ తరఫున పని కల్పిస్తామన్నారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. గృహజ్యోతి, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్, రేషన్ బియ్యం వంటి సంక్షేమ పథకాలు . సగరం సంగం లోఅర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చూస్తామన్నారు. అర్హులైన సగరులు పథకాల కోసం ప్రజావాణిలో దరఖాస్తులు చేసుకోవాలని, జిల్లా స్థాయిలో పరిశీలించి, అర్హులకు ప్రయోజనాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.అలాగే నిర్మాణరంగంలో పనిచేస్తున్న సగరులు, కార్మికులు లేబర్ కార్యాలయంలో నమోదు చేసుకుంటే అనుకోని సంఘటనల సమయంలో సహాయం అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు.సగరశీ సంఘం తరఫున అర్హుల జాబితా అందిస్తే వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సహకరిస్తామని పేర్కొన్నారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, సమాచార శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు సగర,బీసీ వెల్ఫేర్ అధికారి సంజీవయ్య, సగరం సంగం అధ్యక్షులు రవికుమార్ సగర, రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లెట్ల మారయ్య సగర, జిల్లా కార్యదర్శి కరుణాకర్ సగర, తదితరులు మాట్లాడారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్, బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది, జిల్లా సాగర సంగం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జిల్లా సగర సంగం ఆధ్వర్యంలో నల్గొండ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.





# ప్రధాని నరేంద్ర మోదీ పై ఖర్గే అనుచిత వ్యాఖ్యలు దురదృష్టకరం ; - వెంటనే క్షమాపణ చెప్పాలి ;

- బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ బంగ్లా డా.లక్ష్మీకాంత్ రెడ్డి ;

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్,23)

భారత ప్రధాని నరేంద్ర మోడీ ని ఉద్దేశించి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు అత్యంత దౌర్భాగ్యకరమని బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్బంగా గురువారం పత్రికా విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో ఒక ఉన్నతమైన పదవిలో ఉన్న వ్యక్తిని, కోట్లాది మంది ప్రజల ఆశీస్సులతో ఎన్నికైన ప్రధానిని 'టెర్రరిస్ట్' అని అనడం ఖర్గే గారి అజ్ఞానానికి, కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్న తరుణంలో, మన దేశ ప్రధానిపై ఇలాంటి నీచమైన పదజాలాన్ని ఉపయోగించడం దేశ ప్రతిష్టను భంగపరచడమేనన్నారు.శ్రీ నరేంద్రమోడీ గారు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నాయకులు ఇలాంటి విమర్శలకు దిగుతున్నారన్నారు. గతంలో కూడా అనేకమంది కాంగ్రెస్ నేతలు ప్రధానిపై వ్యక్తిగత దూషణలు చేసి ప్రజల ఆగ్రహానికి గురయ్యారన్నారు. శ్రీ మల్లికార్జున ఖర్గే లాంటి వారు ఇలా మాట్లాడాల్సింది కాదని, తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, దేశ ప్రజలకు మరియు ప్రధానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు.రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజమని, కానీ అవి హుందాగా ఉండాలని, ఉగ్రవాదం వంటి తీవ్రమైన పదాలను ప్రధానిపై వాడటం ద్వారా కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ స్థాయిని తగ్గించుకుని దేశ ప్రజలు అసహించుకునే విదంగా మాట్లాడుతున్నారని బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి తెలిపారు.



# ఎస్ పి ఎఫ్ ఆధ్వర్యంలో హరితహారం...

నాగార్జునసాగర్ ఏప్రిల్, 23:

నందికొండ మున్సిపాలిటీ నాగార్జునసాగర్ లో గురువారం నాడు ఎస్ పి ఎఫ్ హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జెన్కో, సాగర్ డ్యాం ఎస్ పి ఎఫ్ ఇన్స్పెక్టర్లు ప్రతాప్ నాయుడు, శ్రీనివాస్ రావులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ పి ఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా, జోన్ డిఐజి మాధవరావు ఉత్తర్వుల మేరకు నాగార్జునసాగర్ ఎస్ పి ఎఫ్ యూనిట్ అసిస్టెంట్ కమాండెంట్ విజయభాస్కరరావు ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక యాక్షన్ 99 కార్యక్రమంలో భాగంగా హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పైలాన్ కాలనీలోని జెన్కో చీఫ్ ఇంజనీర్ కార్యాలయం, జెన్కో ఎస్ పి ఎఫ్ ఇన్స్పెక్టర్ కార్యాలయం, సాగర్ డ్యాం ఎస్ పి ఎఫ్ ఇన్స్పెక్టర్ కార్యాలయం, అసిస్టెంట్ కమాండెంట్ కార్యాలయ పరిసరాలలో మొక్కలను నాటినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జెన్కో సీ.ఈ.మంగేష్ కుమార్ మరియు ఎస్ పి ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.





అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు కారిడార్

## డబుల్ డెక్కర్ కారిడార్‌తో ట్రాఫిక్‌జామ్‌కు చెక్

## ప్రాజెక్ట్‌పై అధికారులతో చర్చించిన మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్,

ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ ఆల్ ఇండియా రేడియో స్టేషన్ వరకు నిర్మించతలపెట్టిన 7.1 కి.మీ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పురోగతిపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గురువారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సుదీర్ఘంగా సుమారు 4గంటల పాటు జరిగిన ఈ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు,ఆర్ అండ్ బి స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్,చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద మోహన్,ఆర్ అండ్ బి సి.ఈ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం నిత్యం యాక్సిడెంట్స్ జరిగే ఈ ప్రాంతంలో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని సంకల్పించిందని మంత్రి అన్నారు. సుమారు 941 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్ట్ లో రాష్ట్ర వాటాగా 200కోట్లు ఇచ్చేందుకు ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. నాగపూర్ తర్వాత ఇండియాలో చేపట్టే రెండో పెద్ద ప్రాజెక్ట్ అన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఎల్బీనగర్,హయత్ నగర్ ప్రాంతాల్లోని 54 కాలనీల్లో నివసించే సుమారు 20లక్షల మంది ప్రజలకు పెద్ద ఉపశమనం



లభిస్తుందని,హైదరాబాద్ - విజయవాడ దారిలో రాకపోకలు సాగించే లక్షల మంది 15నిమిషాల్లోపే సిటీ క్రాస్ చేస్తారని అన్నారు. ఎన్‌హెచ్ 65 రూట్ లో ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు విపరీతమైన రద్దీ ఏర్పడి,రోడ్ క్రాస్ చేసేటప్పుడు నిత్యం యాక్సిడెంట్స్ జరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే సమీప కాలనీల్లో నివసించే ప్రజలు కింద సర్వీస్ రోడ్డు ద్వారా సులువుగా రోడ్డు దాటవచ్చు అని,ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తొలగిపోతాయని చెప్పారు. దీనికి వీలైనంత త్వరగా సాంక్షన్స్ చేసుకొని,టెండర్ ప్రక్రియ పూర్తి చేసేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు వార్షిక ప్రణాళికలో ఇప్పటికే పొందుపర్చామని కృష్ణ ప్రసాద్ తెలిపారు. కింద సర్వీస్ రోడ్డు, మధ్యలో జాతీయ రహదారి,పైన మెట్రో రైలు నిర్మాణం నేపథ్యంలో సాంకేతికంగా పిల్లర్ ఫౌండేషన్,స్టక్చర్స్, మెట్రో స్టేషన్స్ వంటి అంశాలపై చర్చించారు. పూర్తి నాణ్యతతో బలమైన పిల్లర్లు, రెగ్యులర్ ఎలివేటెడ్ కారిడార్ కంటే పటిష్టంగా,వెడల్పుగా డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పిల్లర్లు నిర్మించాలని ఈ సందర్భంగా చర్చించారు. ఈ నేపథ్యంలో ఒకే వర్క్ ఏజెన్సీ నిర్మాణ పనులు చేపడితే సమన్వయలోపం లాంటి ఇబ్బంది లేకుండా..త్వరగా పూర్తి చేసేందుకు వీలుగా ఉంటుందనే అభిప్రాయం మంత్రి వ్యక్తం చేశారు. నిర్మాణ పనులు మానిటరింగ్ చేయడానికి వీలుగా ఉంటుందనీ,పనులు కూడా సమాంతరంగా జరుగుతాయని మంత్రితో అధికారులు తమ అభిప్రాయాలను చెప్పారు. మంత్రి సూచన మేరకు అందుకు అనుగుణంగా చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్ ప్రాజెక్ట్ కన్సెంట్ ఇచ్చేందుకు అంగీకరించారు. కన్సల్టెన్సీని పిలిచి డీటెయిల్డ్ ఎస్టిమేట్స్ తయారు చేయాలని



నిర్ణయించారు. అధికారులు తమ స్థాయిలో ఉన్న పనులు త్వరగా పూర్తి చేస్తే.. వచ్చే వారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పనులు వెంటనే ప్రారంభించేలా విజ్ఞప్తి చేస్తానని చెప్పారు.

# ఎస్ఐఆర్ ప్రత్యేక ఇంటెన్స్ మ్యాపింగ్ వేగవంతం చేయాలి - జిల్లా కలెక్టర్ చంద్ర శేఖర్

అక్షరకలం నల్గొండ

(ఎస్ఐఆర్) స్పెషల్ ఇంటెన్స్, ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవనంలో ఏఈఆర్వోలు, తహసీల్దార్లు, బీఎల్‌వోలుతో నిర్వహించిన సమీక్ష సమావేశంలోపాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో వెనుకబడిన



బీఎల్‌వోలు తక్షణమే పనులను వేగవంతం చేయాలని



సూచించారు. ఇప్పటికే 50 శాతం మ్యాపింగ్ పూర్తి చేసిన వారు మిగతా పనిని త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఇంటి ఇంటికీ తిరిగి హౌస్ టు హౌస్ సర్వే నిర్వహించి మ్యాపింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో సమావేశాలు నిర్వహించి గ్రామస్తుల సహకారంతో ఫోటో మ్యాపింగ్ చేపట్టాలని తెలిపారు .పట్టణ ప్రాంతాల్లో వార్డు వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. డూప్లికేట్ ఓట్లు, డబుల్ ఓట్లు ఉన్నట్లయితే వెంటనే ఫారం-7 ద్వారా తొలగింపులు చేపట్టాలని స్పష్టం చేశారు. మ్యాపింగ్ పూర్తి చేసిన వారు ఇతరులకు మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు. ఇంకా మ్యాపింగ్ చేయని ఓటర్ల జాబితాను డౌన్‌లోడ్ చేసుకుని ఫోన్ నంబర్ల ఆధారంగా సంప్రదించి 50 శాతం పూర్తి చేసిన వారు 100 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అర్బన్ ప్రాంతాల్లో మ్యాపింగ్ పూర్తి కాని జాబితాను తీసుకుని బీఎల్‌వోలు, బిల్ కలెక్టర్లు, ఆర్పీల సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే ఈఆర్‌ఓలకి తెలియజేయాలని, సాంకేతిక సమస్యలుంటే తహసీల్దార్లను సంప్రదించాలని సూచించారు. 30 శాతం వరకు పూర్తి చేసిన వారు ఏప్రిల్ 27లోపు కనీసం 50 శాతం పూర్తి చేయాలని కలెక్టర్ గడువు నిర్దేశించారు. నిర్లక్ష్యం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్ స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై అశోక్ రెడ్డి. ఏ ఈ ఆర్ ఓ లు తహసిల్దార్లు బి ఎల్ ఓ లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలో వేడెక్కిన పోరు..!





## రెండో రోజుకు చేరిన ఆర్టీసీ సమ్మె

## సమ్మెకు మద్దతుగా విపక్షాల కదలిక

## నల్లగొండ పట్టణంలో ర్యాలీ, అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం

## డ్రైవర్ ఆత్మహత్యాయత్నం.. అడ్డుకున్న సిబ్బంది

## తాత్కాలిక సిబ్బందితో రోడ్డెక్కిన 50 శాతం బస్సులు

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం

తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఆర్టీసీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారం రెండో రోజుకు చేరింది. ఉమ్మడి నల్గొండ జిల్లావ్యాప్తంగా కార్మికులు తమ నిరసనను ఉధృతం చేశారు. మొదటి రోజు కేవలం 10 శాతం బస్సులు మాత్రమే నడవగా, రెండో రోజు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ముమ్మరం చేయడంతో బస్సుల సంఖ్య పెరిగింది.

### ర్యాలీలు.. ధర్నాలతో హోరెత్తిన నల్లగొండ...

గురువారం జేఏసీ ఆధ్వర్యంలో నల్లగొండ ఆర్టీసీ డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం డిపో నుండి క్లాక్ టవర్ మీదుగా భాస్కర్ టాకీస్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఉన్న అంబేద్కర్ విగ్రహానికి తమ గోడును వెళ్లబోసుకుంటూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

### మద్దతు తెలిపిన రాజకీయ పక్షాలు...

కార్మికుల పోరాటానికి రాజకీయ వర్గాల నుండి మద్దతు లభించింది. సిఐటియు జిల్లా కార్యదర్శి సలీం, బిజెపి జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి సమ్మె శిబిరాన్ని సందర్శించి కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

### డ్రైవర్ ఆత్మహత్యాయత్నం..

సమ్మెలో భాగంగా గురువారం ఒక విషాదకర సంఘటన చోటుచేసుకుంది. మిర్యాలగూడ డిపోకు చెందిన డ్రైవర్ రావురి వెంకన్న ఆవేదనతో ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన తోటి సిబ్బంది వెంటనే ఆయనను అడ్డుకోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో డిపో వద్ద ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

### తాత్కాలిక సిబ్బందితో బస్సుల నిర్వహణ...

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఏడు డిపోల్లో రవాణా వ్యవస్థ స్తంభించకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రతి డిపోకు సుమారు 30 నుండి 35 మంది చొప్పున తాత్కాలిక కండక్టర్లను నియమించి, వారికి తక్షణ శిక్షణ ఇచ్చి విధుల్లోకి తీసుకున్నారు. ఫలితంగా గురువారం జిల్లాలో 50 శాతానికి పైగా బస్సులు నడిచినట్లు అధికారులు వెల్లడించారు. అయినప్పటికీ, అనుభవజ్ఞులైన సిబ్బంది లేకపోవడంతో ప్రయాణికులు కొన్నిచోట్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

### 398 బస్సులు నడిచాయి... జానీ రెడ్డి (ఆర్ఎం నల్గొండ )

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏడు డిపోల పరిధిలో 708 బస్సులకు గాను గురువారం సాయంత్రం వరకు 398 బస్సులు నడిపాము. అద్దె బస్సులు ఎలక్ట్రిక్ బస్సులు మెయిన్ రూట్ లలో నడిచాయి. తాత్కాలికంగా డిపోకు 30 నుంచి 35 మంది కండక్టర్లను తీసుకున్నాము.



# భగీరథ మహర్షి త్యాగం, పట్టుదల ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తాయి... - జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్....





మెదక్/ కొల్చారం ఏప్రిల్ 23(అక్షర కలం):-

గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతివేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ హాజరై, జ్యోతి ప్రజ్వలన గావించి, మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సగర వంశీయులైన భగీరథ మహర్షి గంగా నదిని స్వర్గం నుంచి భూమిపైకి తీసుకువచ్చిన గొప్ప తపస్వి అని కొనియాడారు. భగీరథ మహర్షి పట్టుదల, సేవాభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని కలెక్టర్ పేర్కొన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి గంగానదిని భూమికి తెచ్చిన మహనీయుడిగా భగీరథుని చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. అందుకే గొప్ప ప్రయత్నాలను 'భగీరథ ప్రయత్నం'గా పిలుస్తారని వివరించారు. అనంతరం అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, కార్యదర్శులు, అధ్యక్షులు, తదితరులు ఆయన చిత్రపటానికి అంజలి ఘటించి, నివాళులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ జోజి, డిపిఓ యాదయ్య, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో యూనస్, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి గంగా కిషన్, సంఘ నాయకులు జిల్లా అధ్యక్షుడు సాయిలు ఉప్పల సాగర సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పేట కలెక్టరేట్ లో ఘనంగా మహర్షి భగీరథ జయంతి వేడుకలు



(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్,23)

నారాయణ పేట జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహర్షి భగీరథ జయంతి వేడుకలకు స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహర్షి భగీరథ చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి మాట్లాడుతూ...భగీరథ మహర్షి ఒక గొప్ప తపస్వి అని అన్నారు. వారు చేసిన తపస్సును ప్రసన్నమై శివ పరమాత్ముడు గంగాదేవిని భూమికి పంపించాడనీ, అందుకే మనము గంగా నదిని భగీరథి అని కూడా పిలుస్తామని తెలిపారు. భగీరథ మహర్షి గంగానదిని భూమికి తీసుకువచ్చి మానవాళి పాపాలను పోగొట్టేందుకు చేసిన కఠోర తపస్సు భారతీయ సంస్కృతిలో విశిష్ట స్థానాన్ని కలిగి ఉందని తెలిపారు. ఆయన చూపిన దీక్ష, సంకల్పం, నిస్వార్థ సేవా భావం నేటికీ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న అసమానతలు, అన్యాయాలను తొలగించేందుకు భగీరథ మహర్షి అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందని ఆమె పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత ఆయన జీవితం నుండి స్ఫూర్తి పొందాలని సూచించారు. ఆ మహాపురుషుని జయంతి సందర్భంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నందుకు ఎంతో సంతోషమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలందరికీ భగీరథ మహర్షి జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏ వో శ్రీధర్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, డీపీ అర్ వో ఎం.ఏ.రషీద్, సగర సంఘం జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు సాగర్, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, పట్టణ అధ్యక్షుడు విజయ్ సాగర్, సంఘం సభ్యులు ఆంజనేయులు, నరేందర్, వెంకటేష్, మన్నే లక్ష్మణ్, హన్మంతు, రవి, రాంపూర్ హన్మంతు, ప్రజాప్రతినిధులు, బి . సి సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మరికల్ మండల కేంద్రంలో అంబేద్కర్ జాతర వాల్ పోస్టర్ విడుదల

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్,23)

నారాయణ పేట జిల్లా కేంద్రంలో మే 1.వ తేదీన పూలే, అంబేద్కర్ 4వ జాతర సాయంత్రం శీల గార్డెన్ లో జరగబోయే పూలే,అంబేద్కర్ జాతర వాల్ పోస్టర్ ను స్థానిక ఎస్సి కమ్యూనిటీ హాల్ దగ్గర విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు పి. ఈశ్వరమ్మ,చంటి, రమేష్ పాల్గొని జాతర విజయవంతం చేయాలనీ కోరడం జరిగింది తదుపరి జాతర కమిటీ ప్రకటించడం జరిగింది గౌరవ అధ్యక్షులుగా మరికల్ గ్రామ సర్పంచ్ చెన్నయ్య సలహా దారులుగా జోగు రామస్వామి,సీమ శివ కుమార్ కొండేటి తిరుమలయ్య,సీమ బాలకృష్ణ,గూప కురుమయ్య మరియు అధ్యక్షులుగా గూప నర్సిములు ఉపాధ్యక్షులు సీమ గోపాల్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ కోశాధికారి సీమ నర్సింహా కార్యవర్గ సభ్యులుగా రాఘవేంద్ర,రాం ఆంజనేయులు,గోవర్ధన్, కొండయ్య, గూప నర్సిములు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




# పారదర్శకత జనగణన కు లక్ష్యంగా తాసిల్దార్లు చిత్తశుద్ధితో పని చేయాలి...

-జిల్లాలో చెరువులు అన్యక్రాంతం కాకుండా డ్రైలాండ్- వెట్ ల్యాండ్ సర్వే నిర్వహణలో ముందుచూపు అవసరం....

- ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రజలకు ప్రయాణానికి అసౌకర్యం కలవకుండా పటిష్ట చర్యలు.....

- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్.....

మెదక్/ కొల్చారం ఏప్రిల్ 23(అక్షర కలం):-





సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో సమావేశ మందిరంలో గూగుల్ మీటి నిర్వహించి సంబంధిత కాసిల్దారులకు జనగణన, డ్రైలాండ్ వెట్ ల్యాండ్ సర్వే, ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రజలకు ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా తీసుకునే చర్యలు వచ్చే ఖరీఫ్ సీజన్లో రైతులకు విత్తనాలు పురుగు మందులు కొరత లేకుండా బఫర్ స్టాక్ ఏర్పాటు చేయడం, జిల్లాలో ధాన్యం కొనుగోలు సమర్థవంతంగా నిర్వహణకు, సమర్థ ఓ టర్ మ్యాపింగ్, గృహ అవసరాల గ్యాస్ కొరత లేకుండా చూడటం, భూభారతి సాదా బైనామా పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం,సంబంధిత అంశాలపై డీఎఫ్ఓ జోజి, డిఆర్డిఓ శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్ , డి ఎం జగదీష్ ,డిపిఓ యాదయ్య, పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, సిపిఓ సురేష్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి, డి ఎం ఆర్టీసీ సురేఖ, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, సంబంధిత తాసిల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జన గణనకు సంబంధించి తాసిల్దార్లు ప్రతి అంశంలో స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని. క్షేత్రస్థాయిలో జనగణనకు సంబంధించి ప్రత్యక్షంగా ఎదుర్కొనే అంశాలను ప్రశ్నలు సమాధానాల రూపంలో అడిగి తెలుసుకున్నారు. జనగణనకు శిక్షణ అనేది చాలా ముఖ్యమైన అంశమని పేర్కొన్నారు. జిల్లాలో సమర్థ జన గణనే లక్ష్యంగా ముందుకు పోవాలన్నారు. జిల్లాలో 606 చెరువుల సంరక్షణలో భాగంగా. డ్రైలాండ్ వెట్ ల్యాండ్ ఈ సర్వే వేగవంతం చేయాలని. సెంట్రల్ గవర్నమెంట్ నిధులు వచ్చే అవకాశం ఉన్నందున రెవెన్యూ, ఫారెస్ట్ ఇరిగేషన్ సమన్వయంతో కమిటీ ఏర్పాటు చేసి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ సమ్మె నేపద్యంలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే వానాకాలానికి రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు సమర్థవంతంగా నిర్వహించాలని ఇప్పటివరకు జిల్లాలో 525 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరిగిందని143 మంది రైతులు నుండి11 కొనుగోలు కేంద్రాల ద్వారా 887 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు. గన్ని బ్యాగులకు సంబంధించి ఎటువంటి కొరత లేదన్నారు. మిల్లర్లు కూడా సహకరిస్తున్నారని వివరించారు. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ విషయంలో వినియోగదారులకు ఎటువంటి అసౌకర్యం కలవకుండా అవసరానికి తగ్గట్టుగా నిల్వలు ఉంచుకొని తద్వారా చర్యలు చేపట్టాలన్నారు. భూభారతి-సాదా బైనామా పెండింగ్ దరఖాస్తులపై కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతిలో గల వివిధ మాడ్యూల్స్ లోని సక్సెషన్, మ్యుటేషన్, ఖాతా సమీకరణ, డేటా కరెక్షన్, అర్బన్ ల్యాండ్, కోర్టు కేసులు, జీపీపీ, పీపీబీ, నాలా తదితరాల పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని, త్వరగా పూర్తి చేయాలని సూచించారు..జిల్లాలో పెండింగ్లో ఉన్న సాదాబైనామా (సింపుల్ సాలె దీడ్స్ )సాదాబైనామా పరిష్కారంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలివారికి ఇచ్చిన లక్ష్యాల మేరకు త్వరితగతిన పరిష్కరించాలన్నారు.పారదర్శకంగా ఎస్ఐఆర్ ( ఎస్ ఐ ఆర్ ) మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగాలని,జిల్లాలో ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా ఓటర్లను చేర్చడం, తప్పుగా నమోదైన వివరాలను సరిచేయడం వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. బీఎల్వోలు (బ్లోస్ ) తమ పరిధిలో ఇంటింటి సందర్శనలు నిర్వహించి, ఓటర్ల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, పేర్లలో ఉన్న తప్పులను సరి చేయాలని తెలిపారు. ముఖ్యంగా అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఉన్న డేటాను సమగ్రంగాసమీక్షించాలన్నారుమ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసి, జిల్లాలో వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత తాసిల్దారులు ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

### తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకం: జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..





పిల్లల చదువు పై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకున్నప్పుడే వారి భవిష్యత్తు బాగుంటుందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జరుగుతున్న సంక్షేమ వారోత్సవాల సందర్భంగా సంగారెడ్డి లో గల మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల జోగిపేట (బాలికలు)లో గురువారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించి, తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి విద్యా ప్రగతి, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని, పిల్లల చదువుపై నిరంతరం శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు తమ సూచనలు, సలహాలు అందించాలని, సమస్యలు ఉన్నపక్షంలో వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అవసరమైతే కంప్లైంట్ బాక్సులు ఏర్పాటు చేసి, విద్యార్థులు మరియు తల్లిదండ్రుల సమస్యలను స్వీకరించి పరిష్కరించే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇంగ్లీష్ భాషలో నైపుణ్యం పెంపొందించేందుకు హాస్టల్లో ప్రతిరోజు ఒక గంటపాటు ఇంగ్లీష్లోనే మాట్లాడే విధానాన్ని అమలు చేయాలని ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులకు ఆదేశించారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి, వారు బలహీనంగా ఉన్న సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో పాటు, ఆసక్తి ఉన్న రంగాలలో ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను సమకూరుస్తోందని, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందించడంతో పాటు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు రెగ్యులర్ హెల్త్ చెకప్లు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వసతి గృహాలలో అందిస్తున్న సౌకర్యాలపై కూడా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రతి నెల నిర్వహించే పేరెంట్స్ మీటింగ్కు తల్లిదండ్రులు హాజరై, పిల్లలతో కలిసి ఒక పూట భోజనం చేసేలా అన్ని వసతి గృహాలకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులలో పెరుగుతున్న మానసిక, భావోద్వేగ సమస్యలను దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు కలిసి వారికి మానసిక ధైర్యం అందించాలని సూచించారు. విద్యార్థులు తమ ఆసక్తి ఉన్న సబ్జెక్టులను ఎంపిక చేసుకుని, తమ ప్రతిభను మెరుగుపరుచుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ప్రోత్సహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తపరిచి, సంక్షేమ వసతి గృహాలలో అందుతున్న నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, ఇతర సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం 2025-26 విద్యాసంవత్సరంలో 5, 6, 7, 8, 9 తరగతుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, ప్రిన్సిపాల్ రజని, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ స్రవంతి, డిప్యూటీ వార్డెన్ జ్యోతి, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కులం సర్టిఫికెట్ అందరు పొందాలని తెలంగాణ రాష్ట్ర బి జె హెచ్ పి ఎస్ అధ్యక్షులు శ్రీ కడమంచి సహదేవుడు

గద్వాల అక్షర కలం

ఇప్పుడే జరుగుతున్న జనగణన, కులగణన సందర్భంగా... ఇప్పుడే జరుగుతున్న జనగణన మరియు కులగణన దృష్ట్యా, మన జాతి బిడ్డలందరూ తప్పనిసరిగా కులం సర్టిఫికెట్ పొందాలని తెలంగాణ రాష్ట్ర బి జె హెచ్ పి ఎస్ అధ్యక్షులు శ్రీ కడమంచి సహదేవుడు కోరుతున్నారు. మనమంతా కూడా దీనిని గంభీరంగా తీసుకుని కులం సర్టిఫికెట్లు తీసుకోవాలి. "మన పిల్లలు చదువుతున్నారు కాబట్టి వారికి అవసరం ఉంది, మనకు అవసరం లేదు" అని ఎవరూ అనుకోవద్దు. అలాగే "మా దగ్గర పాత సర్టిఫికెట్లు ఉన్నాయి" అని కూడా నిర్లక్ష్యం చేయకండి. ప్రస్తుతం కేటగిరీ-1గా నమోదు అవుతున్నందున, ప్రతి ఒక్కరు కొత్తగా కులం సర్టిఫికెట్ తీసుకోవడం అవసరం. చదువు లేని పెద్దవాళ్లు సహా పుట్టిన ప్రతి ఒక్కరికీ కులం సర్టిఫికెట్ ఉండాలి. రాబోయే కాలంలో కొన్ని వర్గాలు మన బేడ (బుడగ) జంగం సమాజం ఎస్సీ కాదని చెప్పే పరిస్థితులు రావచ్చు. అలాంటి సందర్భాల్లో మన హక్కులను కాపాడుకోవడానికి ఇప్పుడే సరైన ధ్రువపత్రాలు ఉండటం చాలా ముఖ్యం. ప్రస్తుతం ప్రభుత్వం కులం సర్టిఫికెట్లు ఇస్తున్నందున ఈ అవకాశాన్ని వినియోగించుకుని వెంటనే పొందాలి. ఇలా చేయడం ద్వారా ప్రభుత్వ రికార్డుల్లో మన జనాభా సరిగ్గా నమోదు అవుతుంది. కాబట్టి, అందరూ కులం సర్టిఫికెట్ తీసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను



## భగీరథ మహర్షి ప్రతి ఒక్కరికి ఆదర్శం.

గద్వాల్ అక్షర కలం

అసాధ్యం అనుకున్న గంగమ్మను భూమండలంకు తీసుకొచ్చి సకల జీవరాశులకు నీటిని అందించిన భగీరథ మహర్షి ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలుస్తారని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఐడిఓసి వద్ద మహర్షి చిత్రపటానికి అధికారులు, సగర సంఘం నేతలు పూలమాలలు వేసి, పూజలు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహర్షులు అంటేనే గొప్ప వ్యక్తులని, అందులోనూ భగీరథ మహర్షి తన తపోశక్తితో సాధించిన విజయం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఎవరైనా ఏదైనా ప్రయత్నం చేసేటప్పుడు విజయం వరించకుంటే భగీరథ మహర్షిని తలుచుకోమని పెద్దలు చెబుతుంటారని, దాంతో విజయం సాధించే వరకు ప్రయత్నం చేస్తూనే ఉండాలన్న అర్థం వస్తుందన్నారు. ఇలాంటి గొప్ప వాళ్ళు చూపిన మార్గం, చేసిన సమాజ సేవ గుర్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఏటా అధికారికంగా జయంతి ఉత్సవాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మహర్షి గొప్పతనం గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, డీఈవో విజయలక్ష్మి, గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, ఇతర అధికారులు, సగర సంఘం నేతలు, తదితరులు పాల్గొన్నారు.





# ఆయిల్ పామ్ తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

**భాస్కర్ రెడ్డి, జిల్లా ఆయిల్ ఫెడ్ అధికారి**



**అక్షర కలం సిద్దిపేట ఏప్రిల్ 23**

ఆయిల్ ఫామ్ తోటల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఆయిల్ ఫెడ్ జిల్లా అధికారి భాస్కర్ రెడ్డి సూచించారు. సిద్ధిపేట జిల్లాస్ నంగునూరు మండలం ఖానాపూర్ లో గురువారం ఆయిల్ పామ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్మెట అంక్షాపూర్ నాగరాజుపల్లి గ్రామ ఆయిల్ పామ్ రైతులు రెడ్డి క్షేత్ర అధికారి నితీష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయిల్ ఫెడ్ అధికారి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగులో మెళకువలు తెలిపారు. ఎరువులు ఏ సమయంలో ఎంత మోతాదులో వేయాలో అవగాహన కల్పించారు. వేసవిలో నీటిని అందించే విధానాన్ని వివరించారు. కొత్తగా ఆయిల్ పామ్ సాగు చేయాలనుకునే రైతులు ఆధార్ కార్డు, పట్టా పాస్ పుస్తకం, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలను క్షేత్ర స్థాయి అధికారికి అందివ్వాలని తెలిపారు.

# బస్టాండ్ల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్త్....

**–ఆర్టీసీ సేవలు అంతరాయం లేకుండా కొనసాగాలి....**

**– ఎస్పీ శ్రీనివాస రావు....**

**మెదక్ / కొల్చారం ఏప్రిల్ 23(అక్షర కలం):–**

టీజీఎస్ఆర్టీసీ జేఏసీ సమ్మె నేపథ్యంలో మెదక్ జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ప్రజా రవాణా సేవలు నిరంతరంగా కొనసాగేందుకు భద్రతా చర్యలను బలోపేతం చేసింది. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. డిపో మేనేజర్ సురేఖతో మాట్లాడిన ఎస్పీ, ప్రస్తుతం నడుస్తున్న బస్సుల సంఖ్య, సేవల స్థితిగతులను తెలుసుకున్నారు. సమ్మె ఉన్నప్పటికీ ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా రవాణా సేవలు సజావుగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బస్టాండ్ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రైవేట్ డ్రైవర్లు, సిబ్బంది భయపడాల్సిన అవసరం లేదని, వారికి పూర్తి భద్రత కల్పిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు. ప్రజా రవాణాకు ఆటంకం కలిగించే చర్యలు, బస్సులకు నష్టం, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసాన్ని సహించబోమని హెచ్చరించారు. అటువంటి ఘటనలు జరిగితే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు సహకరించాలని, అనుమానాస్పద కదలికలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ వెంట డియస్పీ ప్రసన్న కుమార్, డిపో మేనేజర్ సురేఖ, సీఐలు మహేష్, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలి ;

**– ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలుచేయాలి**

**– రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన మాట ను నిలబెట్టుకోవాలని**

**–ఆర్టీసీ సమ్యకు మద్దతు తెలిపిన బీసీ జాగృతి సేన**

నారాయణపేట జిల్లా ఆర్టీసీ డిపో కార్మికులు చేస్తున్న ఆర్టీసీ రక్షణ కోసం ,సమస్యల సాధన కోసం సాగుతున్న సమ్మెలో బీసీ జాగృతి సేన జిల్లా అధ్యక్షులు ఎడ్ల కుర్మయ్య గురువారం పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని. అలాగే 2019 సమ్మె కాలం లో నమోదయిన పోలీస్ కేసులను ఎత్తివేయాలని వారి డిమాండ్లను లను వెంబడే రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని. మీరు చేపట్టిన సమ్మెకు మా పూర్తి మద్దతు ఉంటుందని



అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వములో విలీనం చేయాలని, ఆర్టీసీ డ్రైవర్లు కండక్టర్లు, ఆర్టీసీ రంగంలో పనిచేస్తున్న కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగుల ను గుర్తించి వేతనాలు పెంచాలని, రిటైర్మెంట్ తర్వాత పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు... పండుగ సందర్భంలో కూడా కుటుంబ సభ్యులకు దూరంగాఉంటూ ప్రయాణికులకుసేవలందిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని, వారి పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని, వారి ఆడపిల్లల వివాహానికి పది లక్షల నగదును అందివ్వాలనికోరారు, కోరారు. అనంతరం నారాయణపేట నియోజక వర్గం అధ్యక్షులు గణేష్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న పోరాటం న్యాయం పోరాటం కావున బీసీ జాగృతి సేన అండగా ఉంటుందని కోరారు ఈ కార్యక్రమంలో బీసీ జాగృతి సేన జిల్లా నాయకులు గజలప్ప ,మద్దూరు మండల అధ్యక్షులు వెంకటయ్య, బాలు, నర్సిమ,తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా రవాణా రక్షణలో రాజీ లేదు

**ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉక్కుపాదం**

**అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు: ఎస్పీ డి.జానకి**

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 23 (అక్షర కలం):**

జిల్లాలో ప్రజా రవాణా వ్యవస్థకు ఎటువంటి అంతరాయం కలగకుండా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. టీజీఎస్ఆర్టీసీ జేఏసీ సమ్మె నేపథ్యంలో మహబూబ్‌నగర్ పట్టణంలోని ఆర్టీసీ నూతన బస్టాండ్ వద్ద భద్రతను మరింత బలోపేతం చేశారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ స్వయంగా బస్టాండ్‌ను సందర్శించి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. బస్టాండ్ పరిసర ప్రాంతాలు, ప్రయాణికుల రాకపోకలు, బస్సుల రాకపోకలపై ప్రత్యేక దృష్టి సారించిన ఎస్పీ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా బస్టాండ్ ప్రవేశ ద్వారాలు, బయట ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించాలని సూచించారు. సమ్మె ప్రభావం ఉన్నప్పటికీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రవాణా సేవలు నిరంతరంగా కొనసాగించడం అత్యంత ముఖ్యమని ఎస్పీ పేర్కొన్నారు. ఆర్టీసీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ బస్సుల నడిపింపు, ప్రయాణికుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.





**ప్రైవేట్ సిబ్బందికి భరోసా**

ఈ సందర్భంగా ప్రైవేట్ డ్రైవర్లు, సిబ్బందితో మాట్లాడిన ఎస్పీ, వారికి పూర్తి భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎవరైనా బెదిరింపులకు గురిచేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వారి సేవల వల్లే ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజా రవాణా కొనసాగుతుందని పేర్కొన్నారు.

**అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు**

ప్రజా రవాణా వ్యవస్థకు అంతరాయం కలిగించే చర్యలు, బస్సుల ధ్వంసం, ప్రభుత్వ ఆస్తుల నష్టం వంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఎస్పీ స్పష్టం చేశారు. అటువంటి చర్యలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే కేసులు నమోదు చేసి అరెస్టులు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**ఎప్పటికప్పుడు నిఘా -- ప్రత్యేక బృందాలు**

బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగుతోందని, ప్రత్యేక పోలీసు బృందాలు పహారా కాస్తున్నాయని అధికారులు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ ఆదేశించారు. అవసరమైతే అదనపు బలగాలను కూడా సిద్ధంగా ఉంచామని వెల్లడించారు.

**అధికారుల సమక్షంలో సమీక్ష**

ఈ సందర్శనలో అదనపు ఎస్పీ ఎన్బీ రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సంతోష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మొతిరాం, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇజాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. భద్రతా ఏర్పాట్లపై వారు వివరాలు అందించారు.

**ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి**

శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు సహకరించాలని, ఎలాంటి వదంతులను నమ్మకూడదని పోలీస్ శాఖ సూచించింది. అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరింది. ప్రజల సహకారంతోనే ప్రజా రవాణా సేవలు సాఫీగా కొనసాగుతాయని, శాంతి భద్రతలను కాపాడటం అందరి బాధ్యత అని జిల్లా ఎస్పీ డి.జానకి స్పష్టం చేశారు.

# ప్రభుత్వ చట్టల గురించి తెలుసుకోవాలి.

**– బాల్యవివాహాలు, బాల్యకార్మిక వ్యవస్థ రూపుమాపాలి.**

**– "రైతే రాజు – వ్యవసాయమే జీవనాధారం"– చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్సె కౌన్సెల్ ;**

**(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్,23)**



నారాయణపేట జిల్లా న్యాయ సేవ సంస్థ లీగల్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం అప్పకపల్లి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ విజ్ఞాన సదస్సును చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ శ్రీ.కే.లక్ష్మిపతి గౌడ్ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్ వారు మాట్లాడుతూ వ్యవసాయం ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, ఆహారం, ఆధునిక పద్ధతులు గురించి, రైతులకు ప్రోత్సాహకాలు, ప్రభుత్వ విధానాల గురించి వివరించారు, రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించి సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలి. ఇది మన ఆరోగ్యానికే కాదు, భూమికి కూడా మంచిది. మట్టి ఆరోగ్యం కాపాడుకోవడం, పంటల దిగుబడి పెంచడంలో ప్రకృతి వ్యవసాయం ఎంతో సహాయపడుతుంది. సరైన మార్కెటింగ్ లేకపోవడం, ధరల హెచ్చుతగ్గులు రైతులకు పెద్ద సమస్యలు. భూసార పరీక్షలు చేయించుకోవడం, పంటల బీమా గురించి తెలుసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రసీదు కచ్చితంగా కలిగి ఉండాలి. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి ప్రజలు మోసపోవద్దు తెలిపారు. న్యాయ వ్యవస్థలో రాజ్యాంగం ప్రకారం అందరికి సమాన హక్కులు కల్పించిందన్ని అన్నారు. ప్రజలు వాటిపై అవగాహన కలిగి ఉన్నప్పుడే తమ హక్కులను నిర్భయంగా పొందుతారని తెలిపారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థ ద్వారా పేదవారు 15100 నెంబర్ కి కాల్ చేసి ఉచిత న్యాయాన్ని పొందవచ్చు అన్నారు. చిన్న పిల్లలకు 18 ఇయర్స్ నిండకముందే వారికి పెళ్లిళ్లు చేస్తున్నారని తెలిపారు. అక్షరాస్యత మరియు చట్టపరమైన అవగాహన మరియు ముఖ్యంగా, సమాజంలోని బలహీన వర్గాలకు హక్కులు, బాల్యవివాహాలు, బాలకార్మిక చట్టాలు, తమ పిల్లలకు చిన్నవయస్సులో పెళ్లిళ్లు చేస్తే పెద్దవారిదే తప్పుగా ఈ కార్యక్రమంలో ఎం.సుధాకర్(ఏ.ఈ.ఓ), పీ. విజయ్ కుమార్ (పంచాయతి సెక్రటరీ), అబ్దుల (గ్రామ ఉప సర్పంచు) మరియు గ్రామా ప్రజలు పాల్గొన్నారు.

# కోటకొండ జడ్పీహెచ్ఎస్ స్కూల్లో విద్యార్థినులకు హెచ్ పి వి వ్యాక్సిన్ - డాక్టర్ వినోద్,



**(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్,23)**

నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో నీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోటకొండ ప్రాథమిక వైద్య డాక్టర్ వినోద్ ఆధ్వర్యంలో హెచ్ పి వి వ్యాక్సిన్ క్యాన్సర్ రాకుండా ముందు జాగ్రత్తగా 14 సంవత్సరాలకు బాలికలకు వ్యాక్సిన్, వేయడం జరిగిందని అన్నారు, ప్రతి ఒక్కరూ 14 సంవత్సరాల బాలికలు ఈ వ్యాక్సిన్ ను వేసుకోవాలని వారు సూచించారు, కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత, మండల రెవెన్యూ అధికారి (ఆర్ ఐ) గోపాల్,ఎం పి హెచ్ ఓ లు అశోక్, సురేష్, సూపర్వైజర్ సరస్వతి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ల్యాబ్ టెక్నీషియం దశరథ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యపై అడిషనల్ కలెక్టర్ కు పిర్యాదు

**గద్వాల అక్షర కలం**



గద్వాల మున్సిపాలిటీ లో తాగునీటి సమస్య పై బి ర్ ఎస్ కౌన్సిలర్ లు అడిషనల్ కలెక్టర్ నర్సింగ్ రావు కు పిర్యాదు చేయడం జరిగింది గద్వాల పట్టణం లో 37వార్డుల్లో తీవ్రమైన నీటి సమస్య రోజురోజుకు పెరిగిపోతుందని సమయపాలన లేకుండా నీటిని వదలడం రోజువిడిచి రోజు నీటిని వదలడం కొన్ని వార్డుల్లో రెండు మూడు రోజులకు ఒకసారి నీటిని వదలడం ప్రజలకు చాలా ఇబ్బందులు పెరిగిపోతున్నాయి అని చెప్పడం జరిగింది అధికారులు లైన్ మెన్ ల కో ఆర్డినేషన్ లేకపోవడం వలన భగీరథ నీటిపై సమీక్ష లేకపోవడం ఈ ఇబ్బందులకు ప్రధాన కారణమని తెలపడం జరిగింది ఫ్లో మీటర్ ను బిగిస్తున్నామని గత 20 రోజుల నుంచి చెప్తున్న కూడా అది ఏమి జరుగుతుందో కూడా తెలవని పరిస్థితి ఉందని బి ర్ ఎస్ కౌన్సిలర్ లు అడిషనల్ కలెక్టర్ కు తెలియజేయడం జరిగింది 7వ వార్డు లో కౌన్సిలర్ జగదీష్ మాట్లాడుతూ మా వార్డులో దాదాపు 60నుంచి 70 ఇళ్లకు చాలా ఇబ్బంది ఉంది అని పదే పదే మున్సిపల్ అధికారులకు చెబుతున్న పట్టించుకోవడం లేదని అ కుటుంబాల ఆవేదన వర్ణనాతీతం వారు దాదాపు 400మీటర్ల దూరం నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారని వార్డు కౌన్సిలర్ వాపోయారు వీటన్నింటిపై స్పందించిన కలెక్టర్ నర్సింగ్ రావు మీ సమస్యను క్షేత్ర స్థాయిలో ప్రత్యేకంగా పరిశీలించి మీ వార్డు ఆఫీసర్ లతో సమీక్ష నిర్వహించి అ ఇబ్బందులను తొలిగిస్తాని హామీ ఇవ్వడం జరిగింది

# ఉన్నత స్థాయికి చేరుకునేలా ప్రోత్సహించాలి.

**గద్వాల అక్షర కలం**

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకునేలా ఉపాధ్యాయులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల్లో గురువారం పేరెంట్ టీచర్స్ మీటింగ్స్, విద్యార్థుల ప్రగతి నివేదిక కార్యక్రమాలను పురస్కరించుకొని ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తే ఉద్యోగాలు సాధించి ఆర్థికంగా ఎవరిపై ఆధారపడకుండా జీవిస్తారని తెలిపారు. విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా, వారికి వివిధ అంశాల్లో



నైపుణ్యాలు పెరిగేలా తల్లిదండ్రులు శిక్షణ ఇప్పించాలని సూచించారు. ఈ సందర్భంగా గురుకుల విద్యాలయంలో చదివి ఇంటర్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సన్మానం చేశారు. అనంతరం అధికారులు గురుకుల విద్యాలయంలోని విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పుల్లూరు గ్రామ సర్పంచ్ సునీతమ్మ, ఉప సర్పంచ్ అబ్దుల్, డీసిఓ అనిలా కుమారి, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ బాషా, ఎంపీఓ ఖాజా మొయినుద్దీన్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ భగీరథ మహర్షి ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం...

జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జ్యోతి

జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

సమాజ అభివృద్ధికి భగీరథ మహర్షి చూపిన మార్గం ఆదర్శం

బిసి అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు





**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

శ్రీ భగీరథ మహర్షి ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.జ్యోతి పేర్కొన్నారు.గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ, ఖమ్మం ఆధ్వర్యంలో కలెక్టరేట్ నందు శ్రీ భగీరథ మహర్షి జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అశోక్, సోమ శ్రీనివాసరావు, వేముల యాకయ్య, పెద్ది శ్రీనివాస్ , ఎన్. బాలకృష్ణ , బి. విజయ్ కుమార్ , అనిశెట్టి లక్ష్మీనారాయణ , టి. రంగనాధ స్వామిలు హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.జ్యోతి మాట్లాడుతూ శ్రీ భగీరథ మహర్షి విశిష్టతను కొనియాడారు. సమాజ అభివృద్ధి కోసం వారు చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారు చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని సమాజ సేవలో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిసి కుల సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకే సీసీ కెమెరాల ఏర్పాటు

మద్యపాన రహిత గ్రామంగా మల్లెపల్లి గ్రామం...

సర్పంచ్ భావన బలవంత్ రెడ్డి వెల్లడి

**సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం..**

కొండాపూర్ మండలం మల్లేపల్లి గ్రామంలో మల్లేపల్లి సర్పంచ్ ఆయిల్ రెడ్డి గారి భావన బలవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మల్లెపల్లి గ్రామపంచాయతీ సెక్రటరీ ప్రమీల పర్యవేక్షణలో మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతతో సీసీ కెమోరాలు అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో పూర్తి మద్యపాన నిషేధం,బెల్టు షాపుల నియంత్రణ, గ్రామాల్లో నేరాలను నియంత్రించేందుకు,



అసాంఘికకార్యకలాపాలు జరగకుండా ప్రశాంతమైన వాతవరణం కల్పించడంలో సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని తెలిపారు. గ్రామంలో మొత్తం 115 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని అన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయం నుండి అనౌన్స్మెంట్ చేస్తే గ్రామం మొత్తం వినపడే విధంగా ఏర్పాటు చేశామని తెలిపారు. సామాజిక మార్పులో మల్లేపల్లి గ్రామం ఆదర్శంగా నిలిచింది. గ్రామస్థుల ఆరోగ్యం, కుటుంబాల ఆర్థిక అభివృద్ధి, శాంతిభద్రతలను మెరుగుపరచడమే లక్ష్యంగా గ్రామంలో సంపూర్ణ మద్య నిషేధాన్ని అమలు చేస్తూ పంచాయతీ ఏకగ్రీవ తీర్మానం చేసింది. మద్యం కారణంగా కుటుంబాలు చితికిపోవడాన్ని గమనించిన సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఈ నిర్ణయం పట్ల ముఖ్యంగా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.సామాజిక మార్పు అనేది కేవలం నినాదాలతోనే రాదు.. గట్టి సంకల్పంతో వస్తుందని నిరూపించింది మల్లెపల్లి గ్రామం. భవిష్యత్తులో సంగారెడ్డి జిల్లాలో మల్లేపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ప్రయత్నం చేస్తామని గ్రామ సర్పంచ్ భావన బలవంత్ రెడ్డి అన్నారు.

# కోరే లక్ష్మమ్మ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించిన -ఖమ్మం టౌన్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ "చల్లా కృష్ణ "

**అక్షర కలం/ దానవాయిగూడెం:**

పాలేరు, నియోజకవర్గ పరిధిలోని 59 డివిజన్ దానవాయిగూడెం కి చెందిన కోరే లక్ష్మమ్మ ఇటీవల కాలంలో అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు తుంబురు దయాకర్ రెడ్డి సలహామేరకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖమ్మం టౌన్ జనరల్ సెక్రటరీ లి"చల్లా కృష్ణన్న " మృతుల కుటుంబాన్ని పరామర్శించి , ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి మనోధైర్యం ని నింపారు, రోజు"దశదిన కార్యక్రమానికి " తమ వంతు



సహాయంగా"చల్లా కృష్ణ" 5,000/ రూపాయలు కుటుంబసభ్యులకు అందజేశారు. వారి కుటుంబానికి ఎల్లపుడూ కాంగ్రెస్ పార్టీ తరుపున అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో "చల్లా కృష్ణ" టీమ్ సభ్యులు పాల్గొనడం జరిగంది.

# హైకోర్టు తీర్పుతో కాళేశ్వరంపై కాంగ్రెస్ ఆరోపణలు బట్టబయలు

పటాన్ చెరు బిఆర్ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి

రాజకీయ ఆరోపణలతో ప్రాజెక్టు విలువను తగ్గిస్తున్నారన్న విమర్శలు

రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి సూచనలు

ప్రపంచ స్థాయి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణంలో కేసీఆర్ పాత్ర కీలకం

కాళేశ్వరరావు గా హరీష్ రావును కొనియాడిన అప్పటి గవర్నర్

మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్

పీసీ ఘోష్ కమిటీ కాదు.. తెలంగాణ పీసీసీ ఘోష్ కమిటీ అంటూ విమర్శ

**సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం..**

పటాన్‌చెరులోని అతిథి గృహంలో బీఆర్ఎస్ విలేకరుల సమావేశంలో ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ హైకోర్టు తీర్పును స్వాగతించారు. పీసీ ఘోష్ కమిటీ నివేదికపై స్టే విధించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి చెంపపెట్టుగా నిలిచిందని పేర్కొన్నారు.గురువారం జరిగిన ఈ సమావేశంలో పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ జెడ్పీటీసీలు గడిల శ్రీకాంత్ గౌడ్, బాల్‌రెడ్డి, రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ...పీసీ ఘోష్ కమిషన్ నివేదిక వాస్తవాలను ప్రతిబింబించకుండా రాజకీయ ఉద్దేశాలతో



రూపొందించబడిందని విమర్శించారు.గత మూడు సంవత్సరాలుగా కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఆరోపణలు న్యాయస్థానం ముందు బట్టబయలయ్యాయని అన్నారు.రైతులకు నీరు అందించాల్సిన ప్రభుత్వం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసి ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపిస్తూ, ఇకనైనా రైతు సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు రైతుల సంక్షేమం కోసం నిర్మించబడిందని, దాన్ని రాజకీయాలకు వాడుకోవడం తగదని అన్నారు.అలాగే ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుపై దృష్టి పెట్టాలని, రైతు బంధు, రైతు భీమా పథకాలను సమర్థంగా కొనసాగించాలని కోరారు. ఆర్టీసీ సమస్యల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్రవ్యాప్తంగా మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయాలు పక్కనపెట్టి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని, రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**పీసీ ఘోష్ కమిటీపై మెట్టు కుమార్ తీవ్ర ఆగ్రహం**

పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.గత మూడు సంవత్సరాలుగా కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించిందన్నారు.ముఖ్యమంత్రి నుండి వార్డు మెంబర్ వరకు కాళేశ్వరం కాదు,కూలేశ్వరం అంటూ ప్రాజెక్టును అవమానించారని విమర్శించారు.రెండు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పీసీ ఘోష్ కమిటీ వాస్తవాలను ప్రతిబింబించలేదని, అది పీసీ ఘోష్ కమిటీ కాకుండా పీసీసీ ఘోష్ కమిటీ లా పనిచేసిందని తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఆ నివేదికను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ కోర్టును ఆశ్రయించగా, హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీకి గట్టి చెంపపెట్టుగా మారిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు రైతుల కోసం నిర్మించబడిందని, మూడు సంవత్సరాల క్రితం పిలర్లు దెబ్బతిన్నప్పటికీ ఇప్పటివరకు మరమ్మతులు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. రైతుల సమస్యలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేసి నీటిని అందిస్తే మేమే స్వాగతిస్తామని తెలిపారు.ప్రపంచంలోనే అతి పెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా కాళేశ్వరం నిలిచిందని, దీన్ని నిర్మించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌దని పేర్కొన్నారు.అలాగే మాజీ మంత్రి హరీష్ రావు ప్రాజెక్ట్ పనులపై ప్రత్యేక శ్రద్ధతో కృషి చేశారని తెలిపారు. అలాంటి నాయకులపై కేసులు పెట్టడం దౌర్భాగ్యమని పేర్కొన్నారు.శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ...మాజీ జెడ్పీటీసీ గడిల శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న విమర్శలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని అన్నారు. రైతుల సంక్షేమం కోసం నిర్మించిన ప్రాజెక్టును దూషించడం దురదృష్టకరమని పేర్కొన్నారు.పీసీ ఘోష్ కమిటీ నివేదికలో వాస్తవాలు ప్రతిబింబించలేదని, అది కాంగ్రెస్‌కు అనుకూలంగా రూపొందించబడిందని విమర్శించారు. హైకోర్టు స్టేతో ఆ కమిటీ అసలు స్వరూపం బయటపడిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనపెట్టి ఆరోపణలకే పరిమితమైందని విమర్శిస్తూ,రైతులకు నీటి సరఫరా అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బిఆరెయస్ నాయకులతో కలిసి సంఘీభావం తెలిపిన దిండిగాల రాజేందర్.

**అక్షర కలం / ఇల్లెందు.**

ఆర్టీసీ కార్మికులు రెండురోజులుగా చేస్తున్న సమ్మెకు మద్దతుగా గురువారం బిఆరెయస్ వ్యవస్థపాక సభ్యులు, జిల్లా గ్రంథాలయం సంస్థ మాజీ అధ్యక్షులు దిండిగాల రాజేందర్ నాయకత్వంలో ఇల్లందు పట్టణ బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు ఇల్లందు ఆర్టీసీ డిపో వద్దకు వెళ్లి సమచేస్తున్న ఆర్టీసీ కార్మికులకు సంఘీబావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా సమ్మెలో ఉన్న ఆర్టీసీ కార్మికులను ఉద్దేశించి దిండిగాల రాజేందర్ మాట్లాడుతూ ముప్పైరెండు వేలమంది ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన హక్కులకోసం సమ్మెలోకి దిగారని, గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి వారి ఎన్నికల మేనిఫెస్టో లో వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని, వేతన బకాయిలు చెల్లిస్తామని, పి.ఆర్. సి. ని, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు అమలుచేస్తామని, మళ్ళీ ఆర్టీసీ లో కార్మిక సంఘాల ఏర్పాటుకు అనుమతిస్తామని హామీ ఇచ్చి, నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఓడదాటక ముందు ఓడ మల్లయ్య ఓడ దాటాక



బోడ మల్లయ్య అన్నా చందంగా వ్యవహారిస్తుందని, సకల జనుల సమ్మె స్ఫూర్తితో హక్కులు సాధించే వరకు సమ్మె కొనసాగించాలని, ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తామని వారి పోరాటానికి అండగా ఉంటామని దిండిగాల తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆరెయస్ నాయకులు టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్ రంగనాథ్, టౌన్ ప్రెసిడెంట్ అబ్దుల్ జబ్బర్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సిలువేరు సత్యనారాయణ, టౌన్ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ నబీ, మండల ఉపాధ్యక్షులు డేరింగుల పోషం, నారపాక వసంతరావు, ములగుండ్ల ఉపేందర్ రావు,లలిత్ పాసి, రామ్ లాల్ పాసి, రాచపల్లి శ్రీను, తుంగపల్లి మహేష్, కుంట నవాబ్, శ్రీకాంత్, టేకులపల్లి శ్యామ్, బజారు సత్యనారాయణ, గడ్డి శీను, కరెంట్ ఆఫీస్ శ్రీకాంత్, ఫైనాన్స్ ఇమ్రాన్,ఆటో యూనియన్ నాయకులు సైదులు, తదితరులు పాల్గొన్నారు.



# మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్, మాజీ మంత్రి వర్యులు హరీష్ రావులకుకు హైకోర్టులో భారీ ఊరట.

**అక్షర కలం / ఇల్లందు.**



కమిషన్ పేరుతో కాలేశ్వరం ప్రాజెక్టు లక్ష్యాన్ని దెబ్బ తీయాలనే రేవంత్ ప్రభుత్వ కుట్రలను నేడు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు తిప్పి కొట్టిందని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ అన్నారు. గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆమె మాట్లాడుతూ కాలేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను నిలిపివేస్తూ తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిది అని ఇల్లందు మాజీ శాసనసభ్యులు హరిప్రియ నాయక్ అన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బిఆర్ఎస్ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రివర్యులు కేసీఆర్ మాజీ మంత్రివర్యులు హరీష్ రావు కు హైకోర్టులో భారీ ఊరట లభించడం హర్షనీయమని అన్నారు. ఇది కేవలం బి ఆర్ ఎస్ విజయం మాత్రమే కాదని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షల విజయానికి సంకేతంగా హరిప్రియ నాయక్ అభివర్ణించారు. జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై స్పందించిన హైకోర్టు ఈ నివేదిక ఆధారంగా ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని,పిసి కమిషన్ తన విచారణలో ఎలాంటి కనీస నిబంధనలు పాటించలేదని అన్నారు. 2025 జూలైలో ప్రభుత్వం సమర్పించిన ఈ రిపోర్టు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని, తెలంగాణ ప్రజల కోసం కాదని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం భారత రాష్ట్ర సమితి పార్టీ పై బురద చల్లేందుకే కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు.

# ఆర్టీసీ బస్టాండ్ ను సందర్శించిన పోలీస్ కమిషనర్...

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :**



టీజీఎస్ఆర్టీసీ జేఏసీ సమ్మె నేపథ్యంలో నగరంలోని బైపాస్ రోడ్డులో గల ఆర్టీసీ నూతన బస్టాండ్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. స్థానిక పరిస్థితులపై ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. బందోబస్త్ లో వున్న పోలీస్, అధికారులు సిబ్బంది మొత్తం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్టీసీ జేఏసీ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రైవేట్ డ్రైవర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పూర్తిస్థాయిలో పోలీస్ రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అదేవిదంగా ప్రజా రవాణా వ్యవస్థకు (బస్సులు) ప్రభుత్వ అస్తులకు నష్టం కలిగించడం, ఆటంకాలు సృష్టించడం వంటి చర్యలకు పాల్పడితే వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని టౌన్ ఏసీపీ రమణమూర్తి కి ఆదేశించారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955